KSR02B140 C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 02, 2016

E ENTERED



గీతల్లో గాంధీ

పే...రెంట్స్

సరోగసిపై పెద్ద చర్చే నడుస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఓ చట్టం కూడా తెస్తోంది. అసలీ విధానం ఎప్పుడో మొదలైనా బాలీవుడ్ తారల సరోగసీ బిడ్డల ద్వారా ఎక్కువ ప్రచారం జరిగింది. ఈ విధానంలో బిడ్డల్ని పొందాలనుకుంటున్నామని తారలు చాలా సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడది వారికి కుదిరినా కుదరకున్నా ఈపాటికే అలా సరోగసి పేరెంట్స్ అయినవారిలో ఆమీర్ ఖాన్ దంపతులు కూడా ఉన్నారు. బాలీవుడ్ స్టార్-డైరెక్టర్‌ల జోడి ఆమిర్, కిరణ్ రావ్‌ల గారాల పట్టి అజాద్. కిరణ్ అనారోగ్య కారణాల వల్ల సరోగసిని ఎంచుకుంది ఈ జంట. 2011 డిసెంబర్1న అజాద్ రాకతో వారి జీవితంలో సంతోషాలు నిండాయి. షారుక్ ఖాన్ బిడ్డలుగా ఆర్యన్, సుహానా, అబ్రామ్‌లు పిల్లలుగా అందరికీ తెలుసు. అయితే అభిరామ్‌ని సరోగసి ద్వారానే పొందామంటూ గౌరీ, షారుక్‌లు ప్రకటించారు. సల్మాన్ ఖాన్ తమ్ముడు సోహైల్ ఖాన్, సీమాల మొదటి సంతానం నిర్వాణ్ తర్వాత సరోగసి ద్వారా పుట్టాడు యోహాన్. కొన్ని నెలల క్రితమే తండ్రిగా ప్రమోట్ అయ్యాడు తుషార్ కపూర్. సరోగసి ద్వారా పుట్టిన తన కొడుకు లక్ష్య పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడంటూ ఇన్‌స్టగ్రామ్‌లో లక్ష్య చిత్రాల్ని కూడా పోస్ట్ చేశాడు ఈ సింగిల్ ఫాదర్. బాలీవుడ్ డైరెక్టర్, కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ కూడా ఈ ప్రక్రియ ద్వారా కావాలనుకుంటే... అభిషేక్, ఐష్‌ల జంట కూడా సరోగసి ద్వారానే మరో సంతానాన్ని పొందే ఆలోచనలో ఉన్నట్టు కొన్ని ముంబయ్ పత్రికలు ప్రచురించాయి. వీరిలో చాలా మందికి అంతకు ముందు సాధారణంగానే బిడ్డలు కలిగారు. అయినా సరోగసీని ఎంచుకుంటున్నందుకు కొన్ని విమర్శలు కూడా వెల్లువెత్తాయి. ఇలా కన్నా అనాథల్ని దత్తత తీసుకుంటే మంచిదని అనే వాళ్లున్నారు.


కిరణ్ రావ్, ఆమిర్


గౌరీ
షారుక్ ఖాన్

సోహైల్ ఖాన్, సీమా

అభిషేక్, ఐశ్వర్య

KSR07BIUA
ENTERED

పిల్లల ఆలనా పాలనా తల్లిదండ్రులు చూసుకుంటారు. మరి తల్లిదండ్రులు నేరస్తులుగా జైలు జీవితాన్ని గడుపుతుంటే... నేరస్తుడి పిల్లలంటూ పసి మనసుల్ని గాయపరిస్తే వారికి మనోధైర్యాన్నిచ్చేదెవరు. చెడు స్నేహాలతో తప్పటడుగులేస్తున్న వారికి మంచి భవిష్యత్తునిచ్చేదెవరు? ప్రభుత్వం, సమాజం వారిని పట్టించుకోకపోయినా ఖైదీల పిల్లలకి అమ్మగా మారి వారికి రక్షణతో పాటు ఉన్నతంగా జీవించే అవకాశాల్ని కల్పిస్తోంది భువనేశ్వర్‌కి చెందిన నీరజాలక్ష్మీ మొహాపాత్ర.



మరో అమ్మ...

అమ్మతో తిరునాళ్లకెళ్లాలి. రంగుల రాట్నం ఎక్కాలి. అమ్మ కొంగున ముడిలోంచి ముడత పడ్డ పది నోటుతో ఓ డజన్ గాజులు చేతులకేయించుకోవాలి. అమ్మ రాలేదు. నాన్నను బడికి తీసుకెళ్లాలి. పాఠశాల ఫంక్షన్‌లో తానిచ్చే ప్రసంగానికి గుండె చప్పుడుతో చప్పట్లు కొట్టే ప్రేక్షకుడిని చేయాలి. పరుగు పందెంలో వచ్చిన మొదటి బహుమతిని మొదటిగా తనకే చూపించి పరుగున థియేటర్‌కు కదిలి నాన్న పక్కన కూర్చొని సినిమా చూడాలి. నాన్న తోడు రాలేడు. అమ్మానాన్నా ఉన్నా కూడా బయటి ప్రపంచంలో అనాథల్లా బతుకులు. గుండెల్ని నిండా గుడి కట్టుకున్న అమ్మానాన్నల గురించి బయటి వ్యక్తుల మాటల్లో భరించలేని అవమానాలు. ఖైదీల కంటే వారి కడుపున పుట్టిన వారే నిజానికి ఎక్కువ శిక్షను అనుభవిస్తుంటారు. తాము చేయని నేరానికి బాల్యం బలైపోతుంటుంది. కారాగార శిక్షను పంచుకుంటుంది. వీరికి అమ్మనాన్నల లోటును మరో అమ్మగా తీరుస్తోంది నీరజ. తల్లిదండ్రులిద్దరూ ఖైదీలుగా మారితే అలాంటి పిల్లల్ని పట్టించుకునేవారు లేక వారి జీవితాలు చిందరవందర అవుతున్నాయి. ఆకలి పస్తులూ, అవమానాలు, చెడుస్నేహాలతో వారు వేస్తున్న తప్పుటడుగులు ఎటువైపుకి దారితీస్తాయో వారికే తెలీదు. అలాంటి పిల్లల్ని ఆదరించి గమ్యంలేని వారి గమనానికి ఒక మంచి బాట వేయాలనుకున్నారు నీరజ. ఈ ఆలోచన రావడానికి ఒక బలమైన కారణం లేకపోలేదు. మహిళా ఖైదీల్లో పరివర్తన కోసం ఒడిషా ప్రభుత్వం 2003లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఖైదీలకు కౌన్సెలింగ్ ఇవ్వడానికి భువనేశ్వర్‌లోని వివిధ జైళ్లని సందర్శించేవారు నీరజ. ఒకరోజు భువనేశ్వర్‌లోని ఒక జైలులో కౌన్సెలింగ్ పూర్తి చేసుకుని తిరిగి వస్తుండగా జైలు ప్రాంగణంలో ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ కనిపించారు. నేరస్తులు కాకపోయినా గోబింద్ మహకుడ్, బెబీనా నాయక్‌లు అక్కడ ఉండడంపై జైలు అధికారుల్ని ఆరాతీశారు నీరజ. హత్యానేరం కేసు వల్ల ఆ పిల్లల తల్లిదండ్రులు ఖైదీలుగా మారడంతో వారిని ఆదరించేవారు లేక పిల్లల బాల్యం జైళ్లలోనే గడపాల్సివస్తోంది. ఇలాంటి పిల్లలు కొందరైతే, జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీల ఐదు సంవత్సరాలలోపు పిల్లలు మాత్రమే వారితో కలిసుండాలనే చట్టాలుండడంతో చాలామంది ఖైదీల పిల్లల జీవితాలు వీధి పాలవుతున్నాయనే చేదు నిజాలూ వెలుగులోకొచ్చాయి. అలాంటి పిల్లల కోసం భువనేశ్వర్ స్పెషల్ జైలు దగ్గరలో హాస్టల్‌ని ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ముందుకొచ్చారు నీరజ. ఆ విషయాన్ని స్థానిక ఐజీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన రాష్ట్ర మహిళా శిశుఅభివృద్ధి శాఖకి సిఫార్సు చేశారు. వారి ద్వారా అందిన 44 వేల రూపాయలతో మధుర్ మయీ ఆదర్శ శిక్షా నిలయం హాస్టల్‌ని ప్రారంభించి గోబింద్ మహకుడ్, బెబీనా నాయక్‌లకి ఆశ్రయాన్నిచ్చారు నీరజ. వివిధ జైళ్ల అధికారుల సాయంతో మరి కొంతమంది పిల్లల్ని తన హాస్టల్‌లో చేర్చుకున్నారామె. పిల్లల ఆహారం, విద్య ఇతర అవసరాల కోసం భువనేశ్వర్‌లోని ఇంటింటికీ తిరిగి డబ్బు సేకరించేవారు. తల్లిదండ్రులతో పాటే జైళ్లలో ఉంటున్న చిన్నారుల కోసం వివిధ జైళ్లకి తిరిగి వారి అమ్మనాన్నల్ని ఒప్పించి మరీ పిల్లల్ని హాస్టల్‌కి తీసుకొచ్చే వారు. వాళ్లని ఒప్పించడానికి ఎంతో ప్రయాస పడాల్సొచ్చిందామెకి.



కలిపేందుకు...

రకరకాల నేర చరిత్రలు కలిగిన ఖైదీల పిల్లలందరూ సమాజంలో ఇరుగు-పొరుగు, తోటి స్నేహితుల చేసే అవమానాల వల్ల తీవ్ర వత్తిడికి గురవుతుంటారు. ఆత్మనూన్యతా భావంతో ఉండే వీరిని మామూలు స్థితికి తీసుకొచ్చేందుకు ఎంతో కృషిచేయాల్సి ఉంటుంది. అలాంటి పిల్లలందరూ నీరజ చొరవతో విద్యావంతులుగా మారుతున్నారు. చదువుతో పాటు డ్యాన్స్, మ్యూజిక్, పెయింటింగ్ వంటి వాటితోనూ ప్రతిభ కనబరుస్తూ ముందడుగేస్తున్నారు. బాగ్దేడా గ్రామానికి చెందిన మానస్ రంజన్ సాహు, భరత్ సాహుల తల్లిదండ్రులు భువనేశ్వర్ జైలులో జీవిత ఖైదీలుగా ఉండడంతో వీరు తమ గ్రామంలో గొర్రెల కాపరులుగా మారారు. వాళ్ల గురించి తెలుసుకున్న నీరజ ఇద్దరినీ తన హాస్టల్‌కి తీసుకొచ్చి చదువు చెప్పించారు. ఇప్పుడు వీరి జీవితం ఓ గాడిలో పడింది. మెడికల్ కాలేజ్ ప్రవేశానికి ప్రి మెడికల్ ఎగ్జామ్ (పి.ఎమ్.ఇ)ని రాశాడు మానస్. జెఇఇ పరీక్ష పూర్తిచేసుకున్నాడు భరత్ సాహు. వీరి జీవితం అక్కడున్న పిల్లలందరికీ ప్రేరణనిచ్చింది. గతేడాది ఫైలాన్ తుఫాను కారణంగా హాస్టల్ భవనం పూర్తిగా దెబ్బతినడంతో ప్రస్తుతం అద్దె గృహంలో ఈ హాస్టల్‌ని నడుపుతున్నారు. ప్రస్తుతం హాస్టల్‌లో 100 మందికి పైగా ఉన్న పిల్లలందరికీ తల్లిలా ప్రేమని పంచుతూ వారు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు చేయూతనిస్తున్నారు నీరజ. ఎవరికీ పట్టని ఇలాంటి వారిని చేరదీయడం, ఆదుకోవడం ద్వారా నేరమనే మచ్చను చిన్నారుల మదిలో నుంచి తుడిచేయడమే. వారి జీవితాలు గాడిన పడటం సమాజానికి అత్యంత అవసరం కూడా.

- శర్వాణి

0M1320222

ఇండెక్స్

స్ఫూర్తి.................3
ఊరి కోసం
స్టార్........4
నా పేరును అమ్ముకోను
నవ్వుల్ పువ్వుల్......... 5
వింత లోకం...........10
కిలో కారం 14 లక్షలే
విజేత.............. 11
కుస్తీ జీవితం
కవిత్వమ్..............14
ఉనికి

గీతల్లో గాంధీ



అట్టమీది కథ...6

సందర్భం - 12
70 ఏళ్ల
'గృహ ప్రవేశం'

తెలుసా..................15
చిరునవ్వుతో
కథ 16
నాన్నా..నన్ను క్షమించు
రుచి....................21
ఆలూ కచోరి
బాల నేస్తాలు...........23
తొమ్మిదేళ్ల చెస్ మాస్టర్
పద వికాసం.....
....24

అంతటా యంత్రుడే

18-9-2016 స్నేహ సంచికలో 'అంతటా యంత్రుడే'లో రోబోటిక్స్ కథా కమామీషు కూలంకషంగా అందించటం అభినందనీయం. వింత లోకం విశేషాలు నచ్చుతున్నాయి. కాలినడకన ఏడు ఖండాల యాత్రని సాగిస్తున్న 'టామ్'కి హ్యాట్సాఫ్. 'వీధి బాలుడు' కవిత ద్వారా హృదయాన్ని చలింపజేశారు. 'నరసింహ సామిల్' కథకర్తకు థ్యాంక్స్. దాలియా పూలు సంగతులు సచిత్ర సహి తంగా ఆకట్టుకున్నాయి. కార్టూన్ పంచ్ ఏపి సిఎమ్‌ని టార్గెట్ చేసుకుని రూపొందించారనిపిం చింది. నవ్వుల్ పువ్వుల్ మరిన్ని పెంచి అందించ ండి. బైక్ అంబులెన్స్ మనక్కూడా రావాలి.

నేమాన సుభాష్ చంద్రబోస్,
పిఎమ్ పాలెం, విశాఖపట్నం

ఆకట్టుకున్నాయి

ఈ వారం స్నేహ చాలా బాగుంది. కాలినడకన ఏడు ఖండాలు చుట్టొచ్చిన టామ్ అందరికీ ఆదర్శప్రాయుడు. వీధి బాలుడు కవిత్వం బాగుంది. అంతటా యంత్రుడే కవర్ స్టోరీ కథనం సూపర్బ్. బాలీవుడ్ బొమ్మల పలుకులు బాగున్నాయి. బైక్ అంబులెన్స్ వారెవ్వా అనిపించింది.

- నీలిమ సుబ్బిశెట్టి,
రాజానగరం.

బైక్ అంబులెన్స్

సుస్తీ చేస్తే నులక మంచంపై రోగుల్ని తీసుకెళ్లే పరిస్థితులు ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో కనిపిస్తూనే ఉంటాయి. ఆస్పత్రులు, అంబులెన్స్‌లు లేక బాలింతలు మార్గం మధ్యలోనే కాన్పులు జరిగి ప్రమాదాలకి గురౌతున్నారు. చిన్న వాహనం వెళ్లడానికి కూడా వీలులేని ఛత్తీస్‌ఘడ్ మారుమూల గ్రామాల్లో ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్న బైక్ అంబులెన్స్‌కి హ్యాట్సాఫ్. ఇలాంటి వాహనాల్ని ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశపెట్టాలి. ప్రకృతిని కాపాడేందుకు ఆగామీలు.. వేట, కలప రవాణాలని మానుకోవడం మనకి కనువిప్పునిస్తుంది. మనిషి శారీరక శ్రమ తగ్గించుకునేందుకు తయారు చేస్తున్న రోబోలు అన్ని రంగాల్లోకి ప్రవేశించి మనిషి ఉనికికే ప్రమాదకరంగా మారనున్నాయి. మనిషి మేధోశక్తికి పోటీనిస్తూ వాటి పరిధిని పెంచుకుంటున్న 'అంతటా యంత్రుడే' అట్టమీది కథ ఆకట్టుకుంది. డిజిటల్ కూతురు, నడిస్తే డాలర్లు, వీధి బాలుడు కవిత, ఆ రెండు పేర్లు, కాలినడకన ఏడు ఖండాలు, నరసింహ సామిల్ కథ బాగున్నాయి.

- కమల,
అనంతపురం

నదీ ద్వీపం

అవనిలోనే అతిపెద్ద నదీ ద్వీపంగా పేరొందిన మజులి విశేషాలు ఆకట్టుకున్నాయి. వేట జీవనాధారంగా బతికే ఆగామీ తెగలు జీవవైవిధ్యం కోసం వేట మానుకోవడం అభినందనీయం. జపాన్ కళాకారులు యకా, తెరుయుకీ, 3డి సీజీ వర్క్‌తో రూపుదిద్దిన డిజిటల్ కూతురు, నడిస్తే డాలర్లు, ఆ రెండు పేర్లు, సర్పంచ్ అంటే, కార్టూన్ పంచ్, జోక్స్ బాగున్నాయి.

- సతీష్,
విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

విద్య ఉపాధి అవకాశాలు లేక మూడు దశాబ్దాల క్రితం సిరువతూర్ గ్రామంలో వలసలు చోటుచేసుకున్నాయి. ఊరిని విడిచి వెళ్లలేక కొన్ని కుటుంబాలు అరకొర వసతులతో అక్కడే ఉంటున్నా పట్టించుకునేవారు లేక అభివృద్ధికి నోచుకోలేదు ఆ గ్రామం. ముప్పై ఏళ్ల క్రితం తమ కుటుంబం వదిలి వెళ్లిన ఆ మారుమూల గ్రామం బాగు కోసం ముందుకొచ్చాడు ఐఎఫ్ఎస్ ఉన్నతాధికారి బాలమురుగన్. తమిళనాడులోని తన గ్రామాన్ని దత్తత తీసుకుని అక్కడున్న 2500 కుటుంబాలకి ఆహారం, తాగునీరు, విద్య సదుపాయాల్ని అందిస్తూ సొంత ఊరు అభివృద్ధికి కృషిచేస్తున్నాడు.

స్ఫూర్తి

ఊరి కోసం

తమిళనాడులోని ఓ మారుమూల గ్రామం సిరువతూర్. గ్రామంలో బడి లేకపోవడంతో పిల్లలందరూ పక్కనున్న పట్టణానికి వెళ్లి చదువుకోవాల్సొచ్చేది. బడికి వెళ్లాలంటే పానికమ్ కుప్పమ్ గ్రామ చెరువు గట్లపై నడుచుకుంటూ 15 కి.మీ. ప్రయాణించిన తర్వాత కీదాలం నదిని దాటాల్సి ఉంటుంది. వీధి దీపాలు కూడా లేకపోవడంతో చీకటి పడితే స్కూల్ నుండి తిరిగి రావడం కష్టమయ్యేది. వీటన్నింటి కారణంగా గ్రామంలో ఆడపిల్లల్ని చదివించడా నికి ఇష్టపడేవారు కాదు. అబ్బాయిలు అరకొర చదువుకుంటే అమ్మాయిలు పూర్తిగా చదువుకి దూరమ య్యారు. విద్య ఉపాధి అవకాశాలు కూడా లేకుండా పోవడంతో ఎంతో మంది ఆ ఊరుని విడిచిపెట్టారు. వీధి దీపాలు, తాగునీరు లాంటి కనీస సౌకర్యాలు కూడా లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులని ఎదుర్కునేవారు. ప్రభుత్వం తమని పట్టించుకోకపోయినా పట్టణాల్లో స్థిరపడ్డ తమ గ్రామవాసులైనా ఊరిని బాగుచేస్తారనుకున్నారు ఆ గ్రామస్తులు. ముప్పై సంవత్సరాలు గడిచినా ఊరి పరిస్థితుల్లో ఏ మార్పూ చోటుచేసుకోలేదు. ఒకప్పుడు బాలమురుగన్ కుటుంబం సిరువతూర్ గ్రామంలో ఉండేది. గ్రామంలో బడి లేకపోవడంతో పన్రుతి పట్టణంలోని బడికి వెళ్లడం కష్టంగా మారడంతో వేరే మార్గం లేక ఊరిని విడిచి వెళ్లింది బాలమురుగన్ కుటుంబం. బాలమురుగన్‌ని తండ్రి బాగా చదివించాడు. ఇండియన్ ఫారెన్ ఆఫీసర్‌గా (ఐఎఫ్ఎస్) ఉత్తర బెంగాల్ క్యాడర్‌లో చెన్నయ్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారిగా విధులు నిర్వహిస్తు న్నాడు బాలమురుగన్. కొన్ని రోజుల క్రితం సిరువతూర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆయన్ని కలిసి గ్రామాన్ని ఆదుకోవా లని కోరాడు. అతని ద్వారా గ్రామ పరిస్థి తుల గురించి తెలు సుకున్నాడు బాల మురుగన్.

దారి దారినా సమస్యే

ఆహారం, తాగునీటి సమస్యతో పాటు గ్రామంలో సరైన ఇళ్లు, వీధి దీపాలు లేక ఎంతో మంది దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. గ్రామంలో ఉన్న ఒక్క ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో రాత్రి సమయంలో జూదం, మద్యపానాలకి అడ్డాగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటుండడంతో కొన్ని కుంటుంబాల్లో ఆడపిల్లల్ని బడి మాన్పించారన్న విషయాలు అతన్ని కదిలించాయి. అప్పుడే గ్రామ పరిస్థితుల్లో మార్పు కోసం పనిచేయాలనుకున్నాడు బాలమురుగన్. తొలిసారి గ్రామంలో అడుగు పెట్టినప్పుడు ఆకలిపస్తులు, చెదిరిన ఇంటి కప్పులతో దయనీయమైన జీవితాన్ని గడుపుతున్న ఊరి ప్రజల వాస్తవ స్థితిగతులు చూసి చలించిపోయాడు. గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామస్తుల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులని ప్రారంభించాడు. భారత రైతు సంఘం (ఇండియన్ ఫార్మర్స్ కోపరేటివ్) ఈ గ్రామానికి సాయపడేందుకు ముందుకొచ్చింది. వారి నుండి 1500 టార్పాలిన్ పట్టాలు, బియ్యం బస్తాలని సేకరించాడు. పాడైపోయిన తాటాకు గుడిసెల్లోనే చాలామంది గ్రామస్తులు జీవితాన్ని గడుపుతున్నారు. అలాంటి వారందరికి రైతులందించిన టార్పాలిన్ పట్టాలు ఇంటి పైకప్పులకి ఉపయోగపడ్డాయి. నెవెలి లిగ్నైట్ కార్పొరేషన్ అందించిన 60 లక్షల రూపాయల సాయంతో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని పునరుద్ధరించడంతో పాటు ఉన్నతాధి కారుల సాయంతో పాఠశాల ఆవరణలో చోటుచేసుకుంటున్న ఆగడాల్ని అరికట్టాడు. అప్పటి వరకు చీకట్లీనుతున్న సిరువతూర్ గ్రామ వీధులు ఇప్పుడు వీధిదీపాల వెలుగుల్ని అద్దుకున్నాయి. పిల్లల్ని చదువు మాన్పించిన తల్లిదండ్రులందరూ వారిని ధైర్యంగా బడికి పంపుతున్నారు. సిరువతూర్, పానికమ్ కుప్పమ్ మధ్య రహదారి మార్గాన్ని నిర్మించేందుకు కృషిచేస్తున్నాడు బాలమురుగన్. చెన్నయ్‌లోని పాన్రుతి తాలూకాలో మారుమూల గ్రామంగా ఉన్న సిరువతూర్ బాల మురుగన్ రాకతో అభివృద్ధి పథంలో నడుస్తోంది.

– శారద



నా పేరును అమ్ముకోను

స్టార్

అమితాబ్‌కు . స్ఫూర్తి ఇప్పటి యువ హీరోలేనట. తనకన్నా అద్భుతంగా నటిస్తున్నారట. రేపేం జరుగుతుందో తమ తరపు నటులకు అదే అద్భుతమని, కానీ ఇప్పటి యువ నటీనటులకు ఓ విజన్ ఉందని మరో పదేళ్లలో తామెక్కడ ఉంటామో కూడా కచ్చితమైన లెక్కలతో చెప్పేస్తున్నారని ఆయన ఈ తరం వెన్నుతడుతున్నారు. ఓ గొప్ప నటుడు ఇంత సాదా సీదాగా తనను తీసుకున్నా ఆ మాటల్లోనే బిగ్ బీ విశాల హృదయం తెలుస్తుంది. 'పింక్' చిత్రం సందర్భంగా ఆయన పలు ఇంటర్వ్యూలు ఇచ్చారు. వాటిల్లో ఎన్నో విషయాల్ని పంచుకున్నారు వాటిల్లో కొన్ని మీ కోసం..

- ఇప్పటి నటులు నా కంటే చాలా ముందున్నారు. నేను ట్రైన్డ్ యాక్టర్‌ను కాదు. వాళ్లు చాలా ప్రతిభావంతులైతే ప్రేక్షకులు వాళ్లలను నాకంటే గొప్పవాళ్లుగా చూస్తారు.
- పింక్ చిత్రంలో కొత్తవారితో పని చేసే అవకాశం వచ్చినందుకు అదృష్టంగా భావిస్తున్నా. ప్రస్తుతం జనరేషన్ చాలా కాన్ఫిడెంట్‌గా ఉంటోంది. ఆ కాన్ఫిడెంట్ వాళ్లకు ఎక్కడి నుంచి వచ్చిందో నాకూ తెలియదు.
- 'పింక్' చిత్రం నాకు మూడో థ్రిల్లర్. దీనికి ముందు వజీర్, తీన్ సినిమాలు విడుదలయ్యాయి. ఇప్పుడు మరో నాలుగు సినిమాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయి.
- సర్కార్ 3, అన్‌ఖేన్ 2, థగ్స్ ఆఫ్ హిందుస్తాన్, దబ్బా గుల్, యానిమేటెడ్ చిత్రం ఆస్ట్రా ఫోర్స్ వంటివి చేయాల్సి ఉంది. వీటితో పాటు కౌన్ బనేగ కరోడపతి కార్యక్రమం మూడేళ్ల పాటు ఉంటుంది.
- ఢిల్లీలోని ఓ అపార్టుమెంట్‌లో ఉండే ముగ్గురు యువతులకు సంబంధించిన కథే 'పింక్'. ఓ రోజు సాయంత్రం వాళ్లంతా కొందరు అబ్బాయిలను కలుస్తారు. ఆ తర్వాత ఓ ఘటన జరుగుతుంది. ఆ కేసును ఆ యువతుల తరపున నేను వాదిస్తాను. నేను కూడా అదే అపార్టుమెం ట్‌లో ఉంటాను. అక్కడ జరిగేవన్నీ ప్రతి రోజూ రహస్యంగా గమనిస్తూ ఉంటాను. ఇదొక సోషల్ థ్రిల్లర్ మూవీ. ఈ సినిమా చట్టానికే మాత్రమే సవాలు కాదు ప్రేక్షకులు కూడా ఏది తప్పు ఏది ఒప్పు అనే సందిగ్ధంలో పడతారు.
- ఈ సినిమాకు సంబంధించి అనేక విధాలుగా రీసెర్చ్ చేశారు. కోర్టు రూమ్‌లో జరిగే సన్నివేశాల కోసం చాలా మంది న్యాయవాదులను సంప్రదించారు.
- టీవీ అయినా సినిమా అయినా గట్టిగా ప్రభావం చూపే మాధ్యమం. ఒక వేళ ఈ సినిమా ప్రభావం చూపితే సంతోషమే. సినిమా చాలా ముఖ్యమైంది. ఆసక్తిని కలుగజేసేది. మూడు గంటల్లో తన తీర్పును చెప్పేది. మనల్ని అత్యధికంగా ఆకర్షించేది మాత్రం సినిమాయే.
- ఒక్కోసారి కొన్ని తప్పులు కూడా ఒప్పు అయిపోతాయి. చెడు కూడా విజయం సాధిస్తుంది. హీరో అంటే హీరోనే.

పాత్రకనుగుణంగా ఆయా నటులు నటిస్తూ ఉంటారు. కానీ ముగింపు అనేది ఆ సినిమా మీద ఆధారపడి ఉంటుంది.

- ప్రపంచంలో మంచిని ప్రచారం చేసే మాధ్యమాలు కొన్ని ఉండేవి అవీ పోయాయి. కానీ ఈ సమాజాలను అనుసంధానం చేయడానికి సినిమా ఒక్కటే ఉత్తమ ఉదాహరణ అని చెప్పాలి.
- ఈ నాలుగు దశాబ్దాలుగా చిత్రసీమలో చాలా మార్పులు వచ్చాయి. అప్పట్లో ఒకేసారి పది నుంచి 15 సినిమాలు చేసేవాళ్లం. అందులో రెండు లేదా మూడు విభిన్నమైన చిత్రాలు ఉండేవి.
- మూడో షిఫ్ట్ చేసేవాళ్లం. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు వరకూ, మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి పది వరకూ, రాత్రి పది నుంచి ఉదయ ఆరు వరకూ పని చేసేవారం. దీని కారణం ఫండింగ్ అండ్ ఫైనాన్సింగ్. నిర్మాత కొంత డబ్బు ఎక్కువగా ఇస్తే వారం రోజులు పాటు షూటింగ్ ఉంటుంది. దీన్ని ఇన్వెస్టర్‌కు చూపించి మళ్లీ కొంత ఇన్వెస్ట్ చేయించుకుని షూటింగ్ చేస్తాడు.
- ఇలా ఆరు నెలలు, ఏడాదో సినిమా తీస్తారు. ఈ ఏడాది కాలం మనం ఖాళీగా ఉండడానికి ఇష్టపడం కదా. వేరే సినిమా చేయడానికి సిద్ధమవుతాం.
- ఇప్పుడైతే ఫైనాన్షియల్ సమస్యలేమీ లేవు. చాలా సంస్థలు వచ్చాయి. బ్యాంకులు ముందుకొస్తున్నాయి. గతం కంటే ఇప్పుడు చాలా సులభంగా ఉంటుంది. ఇది మొత్తం సినిమా తీశాక వచ్చే ప్రాఫిట్‌పై ఆధారపడి ఉంటుంది.
- గతంలో ఏడాదికి 15 సినిమాలు తీయడం ఎంత ఎక్కువ అయితే ఇప్పుడు ఏడాదికి మూడు సినిమాలు తీయడం ఎక్కువ.
- 74 ఏళ్లలో కూడా ఇంత ఎనర్జిటిక్‌గా ఎలా చేయగలుగుతున్నారని అందరూ అడుగుతున్నారు దీనికి సమాధానం ఎలా చెప్పాలో నాకే తెలియదు. నేను వెళుతున్నాను పని చేస్తున్నాను అంతే. నాకు ఈ ఎనర్జీ ఎక్కడి నుంచి వస్తుందో నాకే తెలియదు.
- నా పని గురించి ప్రేక్షకులు అడుగుతుంటే నాకెంతో ఆనందమనిపిస్తుంది. అభిమానుల మనసులో ఏముందో గానీ నేను పని చేయాలి కాబట్టి నేను ఇదే ఎనర్జీని కొనసాగిస్తాను.
- ప్రతి సంవత్సరం చిత్రసీమ గురించి ఏవేవో ప్రచారాలు చేస్తుంటారు. ఇక ఈ సంవత్సరంతో దీని పని అయిపోతుందని చెబుతుంటారు. 'ప్రొడక్షన్ హౌస్ మూత.. పంపిణీదారులు షాపు మూసేశారు.. సినిమాలు పడిపోయినట్టే..' ఇటువంటివన్నీ కరెక్ట్ కాదు. ఇలా ఎప్పటికీ జరగదు. నేను అటువంటివి చూడను.
- ఈ ఇబ్బందులన్నీ తాత్కాలికం. చిత్రసీమ జీవించే ఉంటుంది. బాధపడాల్సిన అవసరం లేదు.
- బాక్సాఫీస్ వద్ద జయాపజయాల విషయంలో ఒత్తిడికి గురవుతానా అంటే.. ఎవరి పేరు చెప్పి సినిమాను అమ్ముతారు? అదృష్టం కొద్దీ నేను ఆ బాక్సాఫీస్ బ్రాకెట్‌లో లేను. చాలా మంది యువ హీరోలు, సెలబ్రిటీస్ భారీగా పారితోషికం తీసుకుంటున్నారు. వారి పేరు చెప్పి సినిమా అమ్ముకుంటారు. నేను నా పేరును అమ్ముకోను.

\- కొప్పుశెట్టి దేవరాజు

నవ్వుల్ - పువ్వుల్

అలా తింటారు

రాము: బ్యాచులర్‌కి పెళ్ళైన వాడికి తేడా ఏమిటి?

సోము: బ్యాచులర్ ఏది పడితే అది తింటాడు. పెళ్ళైన వాడు ఏది పెడితే అది తింటాడు.

ఇదీ నిజం

వాసు: సార్! మీ బిజినెస్ పార్టనర్ మిమ్మల్ని లక్షాధికారిని చేశారట?

శ్రీను: మీరు విన్నది నిజమే కాకపోతే ఇంతకు ముందు నేను కోటీశ్వరుడిని.

కాపీ బతుకు



టీచర్: పరీక్షల్లో కాపీ కొడుతూనే చదువు పూర్తి చేశావు. తరువాత ఏం చేసి బతుకుతావు?

స్టూడెంట్: డబ్బింగ్ సినిమాలు చేసి బతుకుతా టీచర్.

చరిత్రకు బ్యాండేజీ



ఇద్దరు ఫ్రెండ్స్ ఒక మ్యూజియానికి వెళ్లారు అక్కడున్న మమ్మీలని చూసి...

వెంగళప్ప: అన్నీ మామూలు మరణాలే ఆ పక్క మాత్రం ఓ యాక్సిడెంట్ కేస్ ఉంది.

సిద్దప్ప: అవును లారీ నెం కూడా రాసుంది. బిసి 1760 అని.

అతిశుభ్రం

రాధ: హల్వా ఎలా ఉంది

రవి: నీకు ప్రతిదీ శుభ్రంగా ఉంచడం అలవాటు కదా?

రాధ: మీకెలా తెలుసు?

రవి: ఏం లేదు.....హల్వా వాసన కన్నా విమ్ సబ్బు వాసనే ఎక్కువగా ఘుమఘుమలాడుతుంటే..!

కిసుక్కు



రమేష్: నీకు ఈదడం వచ్చా?

సురేష్: రాదు.

రమేష్: నీ కంటే కుక్క నయం. వాటికి ఈదడం వచ్చు.

సురేష్: మరి నీకు ఈత వచ్చా?

రమేష్ : వచ్చు...

సురేష్: అంటే నీకు కుక్కకీ తేడా ఏమి లేదన్న మాట.

బుర్రతో కొట్టాలి



భార్య: మీ తల ఎందుకలా బొప్పి కట్టింది.

వెంగళప్ప: గోడ మీద వాలిన దోమల్ని రాయితో కొడుతుంటే బుర్ర ఉపయోగించమని నువ్వేగా చెప్పావ్.

రెండు తప్ప



కస్టమర్: ఈ రేడియోలో ఎన్ని స్టేషన్లు వస్తాయి.

సేల్స్‌మ్యాన్: పోలీస్‌స్టేషన్, ఫైర్ స్టేషన్ తప్ప అన్ని స్టేషన్లూ వస్తాయి.

నిప్పు

రాము: అమ్మాయిలు ఎక్కువ వర్క్ చెయ్యని ప్లేస్ ఏంటి?

సోము: ఫైర్ డిపార్ట్‌మెంట్...

రాము: ఎందుకో చెప్పగలవా

సోము: అమ్మాయిల పనే నిప్పు పెట్టడం. ఆర్పటం కాదు.

సెల్ఫ్‌కంట్రోల్

చంటి: టింకు సెల్ఫ్ కంట్రోల్ అంటే ఏంట్రా?

టింకు: ఈ పెద్దాళ్లు కొన్నాళ్లు సిగరెట్లు, మందు తాగినంత మాత్రాన వాటికెలా బానిస అవుతారో నాకు అర్థం కాదు. నేను ఎల్‌కెజి నుంచి పుస్తకాలు చదువుతున్నా ఇప్పటికీ పుస్తకం నాకు వ్యసనం కాదు. దీన్నే సెల్ఫ్ కంట్రోల్ అంటారు.

గాంధీ బొమ్మను మీరెప్పుడైనా తేరిపారా చూశారా?
జిహ్వాకో రుచి అన్నట్టుగా..
చూసే దృష్టిని బట్టి, దృష్టి కోణాన్ని బట్టి ఒక్కొక్కరికీ ఒక్కోలా కనపడతాడు మన బాపూ.
గాంధీ ఎంత సింపుల్‌గా ఉంటాడో.. అంత అర్థం కాకుండానూ ఉంటాడు.
అదేంటి అర్థం కాకపోవడమేంటి? అనొచ్చు. స్ట్రయిట్‌గా చెప్పాలంటే
సృజనకారులకు అస్సలు అర్థం కాడు,
అంతే.. సులభంగా అర్థమయ్యేది కూడా గాంధీ రూపమే.
కొందరికి గాంధీజీ బొమ్మ అంటే నల్లేరుపై బండినడక
కొందరికి ఎంకేజీ బొమ్మంటే.. శోధన, అన్వేషణ
ఇంకొందరికి అద్భుతాలు చేయగల బ్రహ్మాండమైన వస్తువు
బాపు ఒక్కడే కానీ.. కానీ రూపాలెన్నో
జగమంతా సృజనజీవుల గీతల్లో గాంధీ జీవిస్తూనే ఉంటాడు.
ఒక్కొక్కసారి అందమైన తైలవర్ణ చిత్రంగా మెరిసిపోతాడు..
ఒక్కొక్కసారి.. అంతొద్దు నాయనా..అని గుండుసున్నాలో ఒదిగిపోతాడు.
ఇంకోసారి.. క్యారికేచర్ గీతల్లో కలిసి పడీపడీ నవ్వించేలా చేస్తాడు.
వెండితెరపై ప్రత్యక్షమై గాంధీగిరి చేస్తాడు. మరోసారి.. పప్పు ధాన్యాల్లో,
వేరుశనగ గింజల్లో, బాల్‌పాయింట్ చుక్కల్లో, నలుపు తెలుపు గీతల్లో,
సుద్దముక్కల్లో, పెన్సిల్ మొనల్లో.. సముద్రతీరాన పేరుకుపోయిన ఇసుక మేటల్లో..
ఇలా ఎక్కడంటే అక్కడే సూక్ష్మంలో మోక్షంగా కనిపిస్తాడు. బాపు ఒక్కడే
రూపాలెన్నో..! గాంధీ బొమ్మ చెప్పే కబుర్లెన్నో...!!

గీతల్లో గాంధీ

- గంగాధర్ వీర్ల
9700423737

బొమ్మగా చెప్పాలంటే బాపుని గీయడం చాలా సులభం. గుండ్రటి సున్నాలో మరో చిన్న సున్నాపెట్టి పక్కన ఓ నిలువుగీత గీసేస్తే ఆబాల గోపాలం అచ్చంగా అది గాంధీ మహాత్ముని బొమ్మే అని నమ్మేస్తారు. ఆ ఆర్టిస్టు చేతులు పట్టుకుని భుజాలు కదిలిపోయేలా అభినందనతో కూడిన షేక్ హ్యాండ్ ఇచ్చేస్తారు. గాంధీ నిజ జీవితంలో ఎంత సింపుల్‌గా జీవించాడో.. బొమ్మల్లోకూడా సింపుల్‌గానే కనిపిస్తాడు. అంతే అందంగా రెండు రేఖామాత్రపు గీతల్లోనూ ఒద్దికగా ఒదిగిపోతాడు. నిజానికి అలా సున్నా చుట్టి గాంధీ బొమ్మను చేసి చూపించింది ఎవరో అజ్ఞాత ఆర్టిస్ట్. కానీ కాస్త గీతలొచ్చే కళాకారులు చాలామంది ఆ ఒరవడి ఒడిసిపట్టి వైవిధ్యమైన నలుపు–తెలుపు గీతల్లో తెగ చుట్టేస్తున్నారు. అలా చిత్ర వైవిధ్యాలకు గాంధీ రూపం ఎప్పుడూ ఓ కేంద్రబిందువే.



కానీ, గాంధీ బొమ్మను ఎంత సులువుగా గీయొచ్చో.. అంతకుమించి కష్టం కూడా. బోసి నవ్వుల్లోని ముడతల్ని.. సజీవంగా చిత్రించాలంటే మాటలు కాదు. చేయి తిరిగిన కళాకారుడైతేగానీ గాంధీ బొమ్మను యథాతథంగా చిత్రించలేరు. అలా చిత్రకారులకు గాంధీ ఎంత మంచోడో.. అంత చెడ్డోడు కూడా. గాంధీ మహాత్ముడిలా బాసిపట్టు వేసుకుని ఓపిగ్గా గీయగలిగితేనే బక్కపలచ గాంధీని హుందాగా గీయగలం లేకపోతే కష్టమండి బాబూ.. అనే చిత్రకారులూ లేకపోలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే గాంధీ బొమ్మను గీయడం చిత్రకారులకు ఒక సవాలే.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమమనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉద్భృతమైన ఎన్నో విప్లవాలు, పోరాటాలు, మార్పులు 19, 20వ శతాబ్దం కళారంగాన్ని అమాంతం మార్చేశాయి. వార్తా పత్రికల వరవడికి కేరికేచర్ల విస్తృతి జోడై గీతల్లో చాలా విషయాల్ని తేల్చేశాయి. కార్టూన్‌లు, కామిక్‌ల యుగంగా కూడా ఆ సంధి కాలానికి పేరు. అలాంటి కాలంలో ఓ వ్యక్తి చుట్టుతా ముఖ్యంగా యూరప్, ఆసియాల్లో వ్యంగ్యపు గీతలు, అభిమానపు కుంచె చిలకరింతలు ఎక్కువయ్యాయి. ఆయనే గాంధీ. కోట్లాది మంది నీడగా ప్రపంచానికి కనిపించిన ఆ రూపాన్ని పోర్ట్రెయిట్‌లు, కేరికేచర్లు, కార్టూన్‌లు ఇలా గీతల్లోనే నడిపించాయి. చిత్రకారులు స్వాతంత్ర్య పోరాట సన్నివేశాల్ని తమ వస్తువుగా తీసుకోవడం సేవగా భావించారు. అలా గాంధీ వారికి కళా వస్తువైపోయారు. దేశీ కళాకారులకే కాదు అంతర్జాతీయ చిత్రకారులకు గాంధీ రూపం ఓ ఎలిమెంట్. గాంధీ కూడా వారికి సమయం కేటాయించేవాడని, చిత్రకళంటే ఆయనకు చాలా ఇష్టమని గాంధీ అభిమానులు చెబుతుంటారు.

సంగ్రామం తొలి అంకంలోనే..

1918లో గాంధీని బెంగాల్‌లోని శాంతినికేతన్‌లో ప్రముఖ చిత్రకారుడు ముకుల్ డే సరోజినీ నాయుడు ద్వారా కలిశారు. తన పోట్రెయిట్ గీస్తానని అడిగితే గాంధీ చిరునవ్వుతో సమ్మతించారు. ఆ తర్వాతి గంటలోనే డే చిత్రాన్ని పూర్తి చేస్తే గాంధీ గుజరాతీ లిపిలో దానిపై సంతకం చేశారు. పదేళ్ల తర్వాత ఇదే ముకుల్ డే సీ.ఎఫ్.ఆండ్రూస్ పరిచయంతో మరోసారి గాంధీని కలిసి డ్రై పాయింట్ శైలిలో గాంధీవి నాలుగు వైవిధ్యమైన చిత్రాల్నే కాక కొన్ని పెన్సిల్ స్కెచ్‌లు కూడా వేశారు.









ఈసారి వేదికైంది సబర్మతీ ఆశ్రమం. ముకుల్ డే సృజనకు మెచ్చుకున్న గాంధీ సబర్మతీ భవనంలోని కొంత భాగాన్ని ఆర్ట్ స్కూల్‌గా వినియోగించుకోమని ఆయనతో అన్నారట. ప్రసిద్ధిగాంచిన తైల వర్ణ చిత్రకారుడు కె.వెంకటప్ప ఊటీకి చెందిన నాలుగు కాలాలకు చెందిన అందాల్ని తన చిత్రాల్లో బంధించి గాంధీకి చూపిస్తే అంత అద్భుతంగా ఉంటుందా ఊటీ అనడమే కాక.. తన చర్కా వెనుక ప్రబోధాన్ని కూడా చిత్రాల్లోకి చొప్పించగలవా అని వెంకటప్పను అడిగారట. 1920, 1930 నాటికి గాంధీ స్వాతంత్రోద్యమాన్ని కళల రూపంలో ముఖ్యంగా చిత్రకళ రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పెద్ద ప్రయత్నమే జరిగింది. 1930 దండి యాత్ర సమయానికి అది ఒక ఎత్తుకు చేరుకుంది. గాంధీ రూపం ప్రధాన పాత్రను సంతరించుకుంది. నందలాల్ బోస్ మలిచిన లినోకట్ రూపం 'బాపూజీ' (12 ఏప్రిల్ 1930) దానికి ఉదాహరణ. 78 అనుచరులతో గాంధీ సాగించిన దండి యాత్ర సన్నివేశాన్ని కళ్లకు కట్టిన ఆ టేకు కళాఖండాన్ని ఆ తర్వాత ఎంతో మంది తమ చిత్రాల్లోకి తర్జుమా చేశారు.

కళకు ఆకృతి

చిత్రకారుడు వినాయక్ ఎస్ మసోజీ దండి యాత్ర సందర్భంలో అర్ధ రాత్రిన గాంధీ అరెస్ట్ అయిన సన్నివేశాన్ని తైల వర్ణ చిత్రంగా వేశాడు. ఏసు క్రీస్తును అర్ధరాత్రి గెత్సామినీ తోట నుంచి ఆయుధధారులైన భటులు తీసుకుపోయిన సన్నివేశాన్ని పోల్చుతూ 'ది మిడ్‌నైట్ అరెస్ట్' పేరుతో వేసిన పెయింటింగ్ సంచలనమైంది. గాంధీ సమకాలీనులు వేసిన గాంధీ పోట్రెయిట్‌ల్లో గాంధీ సంతకం కనిపిస్తుంది. దానితో పాటు ఆయన తన సూక్తుల్ని కూడా రాసేవాడు. గాంధీ రూపం ఎంత అనుకూలమంటే చాలా మంది కార్టూనిస్ట్‌లు ఆయన ప్రసంగ వేదికల వద్దే కూర్చుని చకచకా ఒక్కో భావోద్వేగాన్ని స్కెచ్‌లు వేసుకునేవారట.

1938 హరిపురా కాంగ్రెస్ సభ సందర్భంగా జాన పద చిత్ర కళ 'పటువా'ల రూపంలో 83 ప్యానెళ్లను వేశారు. హరిపురా పోస్టర్లుగా ఇవి ప్రసిద్ధి చెందాయి. వీటిని నందలాల్ బోస్ చేత గాంధీనే వేయించారు. గాంధీని కొందరు చిత్రకారులు తమ కళా వస్తువుగా ఫాలో అయ్యేవారు. వారిలో రష్యా చిత్రకారుడు ఫెలిక్స్ టోపోల్‌స్కీ ఒకరు. 1944-46 మధ్య కాలంలో ఆయన గాంధీ పోట్రెయిట్‌ల కోసం చాలా అధ్యయనం చేశారు. గాంధీ రూపాన్ని అనేక కోణాల్లో పరిశీలించి ఆయన ఎన్నో స్కెచ్‌లు వేసుకున్నారు. వాటిలో గాంధీ పర్సనాలిటీని చూపించారు. వీటిలో ఓ వైచిత్రం కూడా ఉందని చాలా మంది అంటారు. గాంధీ హత్యకు గురయ్యే అవకాశాన్ని ఆ చిత్రాల్లో ఫెలిక్స్ మర్మంగా చూపించాడని చెబుతారు. ఈ విషయాన్ని ఫెలిక్స్ అంగీకరించలేదు, కొట్టి పారేయలేదు.

విస్పష్ట రేఖల్లో..

గాంధీ హత్యోదంతానికి ముందు వెనుక అనే స్పష్టమైన చిత్ర కళ పద్ధతులు కనిపించకున్నా దాని ప్రభావం మాత్రం తీవ్రంగానే కళా రంగంలో పడింది. గాంధీ నిండు రూపం బదులు ఆయన సాదాసీదా జీవితాన్ని తెలియజేసే ఆహార్యం చిత్రాల్లో కనిపించడం ఎక్కువైంది. చర్కా, కళ్లజోడు, ఊత కర్ర, వస్త్రాలు వీటినే ఉపయోగించి గాంధీ రూపాన్నివ్వడం ప్రారంభించారు. ఈ పరిణామ క్రమాన్ని చూడాలంటే ఢిల్లీలోని గాంధీ జాతీయ మ్యూజియం సందర్శించాలి. అందులో పలు కాలాలకు చెందిన శైలులు, రీతుల్లోనే కాక వైవిధ్యమైన చిత్రీకరణలతో ఉన్న గాంధీ పోట్రెయిట్‌లు, కేరికేచర్‌లు, పెయింటింగ్‌లు



కనిపిస్తాయి. ఆధునిక పోకడల్లో కూడా గాంధీ రూపాన్ని లీనం చేయడం కూడా ఎక్కువైంది. టైపోగ్రఫీ ఆర్ట్‌లో కూడా ఇప్పటి చిత్రకారులు ఆయన రూపాన్ని నిలిపేశారు. మిక్స్‌డ్ ఆర్ట్‌లోను ఆయన రూపం అనేక రూపుల్ని దిద్దుకుంది. రామన్ నూనెజ్ వేసిన 'ఐకానోస్ యూనివర్సలెస్' విశ్వ వేల్పుల్లో గాంధీ రూపం ప్రముఖంగా గుర్తింపు పొందింది. క్యూబిక్ ఆర్ట్, మెస్సీ ఆర్ట్, యాబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, వెక్టార్ పోట్రెయిట్ పద్ధతుల్లోను ఆయన రూపంపై ఎన్నో ప్రయోగాల్ని చూస్తునే ఉన్నాం. ఇది ఇప్పటి తరం శైలి. దశాబ్దాలు గడిచాక కూడా అంతర్జాతీయ కళాకారులకు నవీన కళారీతులకు ఆయన రూపం కథా వస్తువుగా వస్తూనే ఉంది. చిత్ర కళ ఎంత పరిణామం చెందుతుందో ఆయన రూపంలోని మార్పు చేర్పులు అంత వినూత్నంగా ఉంటున్నాయి.

ఇప్పటికీ ప్రేరణే..

ఎంత ఆధునిక శైలులు వచ్చినా కూడా గాంధీ రూపాన్ని ఇంకా ఆపాత మధురాల్లో చొప్పిస్తున్న మేటి కళాకారులున్నారు. జానపద చిత్రకళతో వాసికెక్కిన పద్మశ్రీ హకూ షా రెండేళ్ల క్రితం 'నిత్య గాంధీ: లివింగ్ రిలివింగ్ గాంధీ' పేరిట ఓ సిరీస్ వేశారు. గాంధీ జీవితాన్ని వాటిలో ఒడిసిపట్టారు.





అది కూడా 80 ఏళ్ల వయస్సులో ఆయన కుంచె నుంచి గాంధీజీకి చెందిన గొప్ప కళాఖండాలు రూపుదిద్దుకున్నాయి. షా క్యాన్వాసుల్లో గాంధీ దేహం లేకుండా ఆయన మనస్సును కథా వస్తువుగా చిత్రీకరించారు. తెలుపు వర్ణానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి తైల వర్ణ కళలో దాని పూర్వ ప్రాభవానికి ఆస్కారం కలిగించారు. ప్లెయిన్ సింబాలిజమ్ కోవకు చెందిన ఈ గాంధీ చిత్రాలు కళాఖండాలుగా నిలిచిపోయాయి. దేశానికి చెందిన మరో అంతర్జాతీయ చిత్రకారుడు ఎస్.హెచ్. రజా కూడా 'పరిక్రమ: అరౌండ్ గాంధీ' పేరిట 2010లో సిరీస్‌ను ప్రదర్శించారు. అందులో గాంధీ భారత్ తిరిగి వచ్చాక ప్రవచించిన బోధనల్ని కళ్లకు కట్టే ప్రయత్నం చేశారు. వీరే కాదు సుబోధ్ గుప్తా, జితిష్ కల్లాట్, అతుల్ దోడియా వంటి ఇప్పటి మేటి చిత్రకారుల గీతలకు గాంధీ రూపం ప్రేరణనిచ్చింది. గ్రాఫిటీ కళతో ప్రపంచంలో ప్రతి దేశపు వీధుల్ని, గోడల్ని తన క్యాన్వాస్‌లుగా చేసుకున్న అంతర్జాతీయ కళాకారుడు బ్యాంక్సీ గోడ గీతల్లోను గాంధీ రూపం వెల్లువెత్తింది. పాలకులకు చురకలంటించి వివాదాస్పదమైన బ్యాంక్సీ ప్రేమ, శాంతి గీతాల్ని కూడా తన గ్రాఫిటీ రంగుల్లో కలిపేసి ఎంతో విలక్షణమైన, ప్రత్యేకమైన కళాకారుడిగా పేరొందాడు. వేల కోట్ల రూపాయలతో తీసే హాలీవుడ్ సినిమాల్లోను బ్యాంక్సీ మాట వస్తుందంటే ఎంత పాపులర్ కళాకారుడో అర్థమవుతుంది. ఆ బ్యాంక్సీ చాలా సందర్భాల్లో తన భావోద్వేగాల్ని గాంధీ రూపాల్లో వ్యక్తీకరించాడు. యుద్ధం, హింస, అణచివేత, బానిసత్వం వంటి చీడల్ని తీవ్రస్థాయిలో ఏకిపారేసే బ్యాంక్సీ గ్రాఫిటీల్లో మార్దవంగా కనిపించే గాంధీ రూపమూ ప్రశాంతంగా కనిపిస్తుంది. ఇలా గాంధీ రూపం విభిన్న, వైవిధ్యమైన చిత్ర కళలపై ప్రభావం చూపుతోంది.

క్యారికేచర్ శిల్పం

సాధారణంగా గాంధీ మహాత్ముడ్ని క్యారికేచర్ రూపంగా ఎంతోమంది క్యారికేచరిస్ట్‌లు, కార్టూనిస్టులు చిత్రించడం మనకు తెలుసు. కానీ ఓ శిల్పి.. తన శిల్పచాతుర్యంతో మహాత్మాగాంధీని కూడా 'క్యారికేచర్'గా మలచి ప్రత్యేకత చాటుకున్నారు. పోలండ్‌కి చెందిన ప్రపంచ ప్రసిద్ధ శిల్పి జోసెఫ్ గోస్లావిస్కీ కాంస్యంతో గాంధీ శిల్పాన్ని క్యారికేచర్ శిల్పాన్ని 1932లో రూపొందించారు. అప్పటికే గోస్లావిస్కీ ప్రపంచ ప్రఖ్యాత శిల్పుల్లో ఒకరు. స్వాతంత్రోద్యమ నేపథ్యంలో గాంధీ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతున్న దశ. ఈ నేపథ్యంలో గాంధీ క్యారికేచర్ శిల్పానికి జీవంపోశారు గోస్లావిస్కీ. పోలండ్ మ్యూజియంలో ఇప్పటికీ ఈ విగ్రహం ఉన్నట్టు సమాచారం.

గాంధీ బొమ్మ సెంటర్

గుడి, బడి లేని ఊరుండొచ్చేమో

కరెన్సీ, స్టాంప్‌ల్లో ప్రత్యేకంగా..

తొలిసారి 1996 నుంచి భారతీయ కరెన్సీ నోట్లపై గాంధీ మహాత్ముని బొమ్మ ముద్రించడం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటిదాకా 'మహాత్మా గాంధీ సిరీస్' పేరుతో రూ.5, 10, 20, 50, 100, 500, 1000 నోట్లను రిజర్వ్ బ్యాంక్ ముద్రిస్తోంది. ఇలా సిరీస్ పేరుతో యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) గాంధీజీ శతజయంత్యుత్సవాల సమయంలో ఆయన గౌరవార్థం 'గాంధీ సిరీస్' పేరుతో ప్రత్యేక పోస్టల్ స్టాంపులు విడుదల చేసింది. భారతీయ ప్రభుత్వం కూడా పలు సందర్భాల్లో గాంధీ స్వాంతంత్రోద్యమ స్ఫూర్తిని గుర్తుచేస్తూ ఆయా బొమ్మలతో స్టాంపులు విడుదల చేసింది. అలా ఇప్పటిదాకా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు సుమారు 250 రకాలకు పైగా ప్రత్యేక పోస్టల్ స్టాంపులు విడుదల చేయడం ఒక రికార్డ్‌గానే చెప్పుకోవాలి.

గానీ గాంధీ బొమ్మలేని ఊరుండదు. అలా గాంధీబొమ్మ విగ్రహం నెలకొల్పిన ప్రాంతాలన్నీ కాలక్రమంలో గాంధీ బొమ్మ సెంటర్లుగా మారిపోతుంటాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే కనీసం వీధికొక గాంధీబొమ్మైనా కనపడుతుంటుంది. కొన్ని ప్రాంతాల్లో అయితే అది ఊరు.. అని చెప్పుకోడానికి, పోల్చుకోడానికి అన్నట్టుగా ఎక్కడో ఒకచోట గాంధీబొమ్మ సింబాలిక్‌గా దర్శనమిస్తుంటుంది. ఇలా పల్లెల నుంచి పట్టణ ప్రాంతాల దాకా గాంధీ విగ్రహాలను నెలకొల్పడం అనేది అనాదిగా వస్తున్నదే. ఎక్కడైనా, ఏదైనా ఒక విగ్రహాన్ని ప్రతిష్ఠించాలంటే ఆ ప్రాంతాలకు చెందిన జనాల అభిప్రాయాలు కలవాలి. కానీ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసే విషయంలో మనుషుల మధ్య పెద్దగా వివాదాలుండవు, అభిప్రాయ బేధాలూ ఉండవు. ఇలా దేశంలో లెక్కకు మించిన విగ్రహాలున్నది ఒక్క గాంధీకే.

ఇతర దేశనాయకుల విగ్రహాలు రూపొందించే విషయంలో, ప్రతిష్ఠించే విషయంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులుంటాయి. అంటే ఆ నాయకుల పోలికలు సరిగ్గా ఉండాలి. కనీసం కొంతలో కొంతైనా పలానా నాయకుడు అని గుర్తుపట్టగలిగేలా ఆ విగ్రహాన్ని రూపొందించాలి. లేకపోతే ఈ విగ్రహం ఎవరిది.. అని జనాలు అడగొచ్చు. కానీ గాంధీ విగ్రహాల విషయంలో అలాంటి సమస్యలుండవు. ఎందుకంటే గాంధీ రూపమే వైవిధ్యం. చేతిలో కర్ర, గుండు, కళ్ళకు కళ్ళజోడు ఉంటే చాలు.. అది 'గాంధీ విగ్రహం' అని పిల్లలు కూడా టక్కున చెప్పేస్తుంటారు. ఇలా వాడవాడలా లక్షలాదిగా వెలసిన గాంధీ విగ్రహాల్లో ఎక్కువ శాతం గాంధీ పోలికలు కనపడవు. అయినా.. చేతిలో కర్ర ఉంది కనుక ఆ విగ్రహం గాంధీయే.. అని సంతృప్తి పడటం భారతీయులకు అలవాటైపోయింది. అలాగని అచ్చంగా గాంధీ రూపంలా, సజీవంగా ఉండే గాంధీ శిల్పాలూ లేకపోలేదు. పిండికొద్దీ రొట్టె అన్నట్టుగా ప్రతిభగల శిల్పి చేతిలో పడి గొప్పగా రూపుదిద్దుకున్న గాంధీ విగ్రహాలెన్నో అనేక ప్రాంతాల్లో ఉన్నాయి.

అతిపెద్ద గాంధీ విగ్రహం

ప్రపంచంలోనే అతిపెద్ద గాంధీ విగ్రహం ఇండియాలోనే ఉంది. బీహార్ రాష్ట్రంలోని పాట్నా నగరంలోని గాంధీ మైదానంలో ఈ విగ్రహాన్ని నెలకొల్పారు. ఇది ప్రపంచంలో కాంస్యంతో తయారుచేసిన గాంధీ విగ్రహాల్లో అతిపెద్ద విగ్రహంగా రికార్డులోకెక్కింది. దీని కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం సుమారు నలభై కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. 72 అడుగల ఎత్తు (22 మీటర్లు) గల



ఈ విగ్రహం మిగతా గాంధీ విగ్రహాల కంటే భిన్నంగా, ప్రత్యేకంగా కనపడుతుంది. చెరో పక్కగా నిలబడ్డ ఇద్దరు చిన్నారులను ఎంతో ప్రేమగా దగ్గరగా తీసుకుని, కర్ర ఊతం లేకుండా నిలబడి నవ్వుతుండే గాంధీ విగ్రహాన్ని యిక్కడ మాత్రమే చూడగలం.

విగ్రహానికి ఆధారమైన దిమ్మపై గాంధీ జీవితంలోని ముఖ్యమైన దండి యాత్ర, క్విట్ ఇండియా ఉద్యమం, తొలి సత్యాగ్రహం, చరకా వంటి చారిత్రక ఘట్టాల్ని శిల్పాకార బొమ్మలతోపాటు ఆ వివరాలను పెద్దపెద్ద అక్షరాలతో లిఖించడం మరో విశేషం. ఈ నిలువెత్తు గాంధీ విగ్రహం పాట్నా నగరానికి ప్రత్యేకంగా చెప్పుకునేలా మారింది.

వెండితెరను ఏలిన 'గాంధీ'

సినిమా కథల పరంగా గాంధీ మహాత్ముడి జీవితం, అహింసా మార్గంలో ఆయన నడిపిన స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఇతివృత్తంగా తీసుకుని ఇప్పటిదాకా పలు స్వదేశీ, విదేశీ చిత్రాలొచ్చాయి. తొలిసారిగా గాంధీ కథను తెరకెక్కించింది మాత్రం విదేశీయులే అని చెప్పాలి. 1953 సంవత్సరంలో 'మహాత్మాగాంధీ: ట్వంటీయెత్ సెంటరీ ప్రాఫెట్' పేరుతో అమెరికాకు చెందిన డైరెక్టర్ స్టాన్లీ లీన్ అనే దర్శకుడు 83 నిమిషాల నిడివితో డాక్యుమెంటరీ చిత్రం నిర్మించాడు. దీనికి నిర్మాత కూడా ఈయనే. ఇంగ్లీషు భాషలో నిర్మించిన ఈ చిత్రం తొలుత అమెరికాలో విడుదలయ్యింది. ఆ క్రమంలో 1992 సంవత్సరంలో జేసీ కాస్యప్ గాంధీ పాత్రలో నటించిన 'నైన్ అవర్స్ టు రామ', 1968లో విఠల్ భాయ్ జవేరి దర్శకత్వంలో 'లైఫ్ ఆఫ్ గాంధీ' ఇలా గాంధీ పాత్రని తెరపై చూపిస్తూ అనేక చిత్రాలు వచ్చాయి.

ప్రపంచవ్యాప్తంగా బాగా ప్రాచుర్యం పొందిన సినిమా రిచర్డ్ అటెన్‌బరో దర్శకత్వంలో వచ్చిన 'గాంధీ' చిత్రమే. 1982లో ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమాలో బ్రిటీష్ యాక్టర్ సర్ బెన్ కింగ్‌స్లే గాంధీ పాత్రలో నటించారు. కమర్షియల్‌గా కూడా బాగా ఆడిన ఈ 'గాంధీ' సినిమా ఇంచుమించు భారతీయ భాషలన్నింట్లో అనువాదమై విడుదలైంది. ఈ సినిమా ప్రతిష్టాత్మకమైన ఎనిమిది అకాడమీ (ఆస్కార్) అవార్డులు గెలుచుకుంది.

ఇలా రాతల్లోనే కాక గీతల్లోనూ గాంధీ అజరామరంగా ఎప్పటికీ నిలిచిపోతారు.

✦

ఇంత లోకం

భలే ఐడియా

స్వీడెన్‌కు చెందిన వానమూఫ్ అనే సైకిళ్ల కంపెనీ ఓ ఐడియాతో తమ రవాణాను మెరుగు పరుచుకుంది. కొంచెం కూడా డ్యామేజీ కాకుండా భద్రంగా సైకిళ్లను కస్టమర్లకు అందిస్తోంది. ఆన్‌లైన్ సేల్స్‌తో ఒక ఊపు ఊపేసిన ఈ కంపెనీకి రవాణాతో కొత్త చిక్కొచ్చి పడింది. సైకిళ్ల పార్ట్‌లే కదా దృఢంగానే ఉంటాయని చాలా రఫ్‌గా హ్యాండిల్ చేసి రవాణా చేసేవారట. వినియోగదారుల నుంచి ఒకటే కంప్లెయింట్లు వచ్చేసరికి ఏం చేయాలో పాలుపోలేదు. ఇంతలో కంపెనీ క్రియేటివ్ డైరెక్టర్ బెక్స్ రాడ్ కత్తి లాంటి ఐడియాతో ఫ్లాట్ చేసేశాడు. ఫ్లాట్ స్క్రీన్ టీవీల ప్యాకేజీ అట్ట పెట్టెలంత సైజే తమ ప్యాకేజింగ్ కూడా ఉండటంతో బాక్స్‌లపై సైకిల్‌కు బదులు ఫ్లాట్ టీవీ బొమ్మ అచ్చు వేయించాడు. దీంతో అందులో ఉండేది టీవీ అనుకుని దాని సుతారంగా హ్యాండిల్ చేస్తున్నాయట రవాణా సంస్థలు. వినియోగదారులకు మాత్రం అర్థమవడానికి టీవీ బొమ్మలో ఓ మూలన సైకిల్ బొమ్మ వేయించారు. ఈ తెలివైన ఐడియా పనిచేసి ఒక్క సైకిల్ కూడా డ్యామేజీ కాకుండా కస్టమర్లకు చేరుతోంది.
2020 కల్లా 90 శాతం అమ్మకాల్ని ఆన్‌లైన్ నిర్వహించాలని చూస్తున్న ఈ సైకిల్ కంపెనీకి ఇలాంటి ఐడియాలు కావాల్సిందే.

కిలో కారం 14 లక్షలే!



పెరూలో మాత్రమే అదీ అడవుల్లో అక్కడక్కడా కనిపించే పచ్చిమిర్చి అజీ చారపిటా. ఓ బొడిపెలా గుండ్రంగా పసుపు రంగులో ఉండే ఈ బుల్లి చిల్లీ మహా మంటెత్తిస్తుంది. జలాపెనో రకం మిర్చి కన్నా చాలా హట్ గురూ. దీని మంట 30 వేల నుంచి 50 వేల స్కోల్‌విల్లే హీట్ యూనిట్స్ మధ్య ఉంటుంది. చాలా అరుదుగా దొరికే ఈ పచ్చిమిరపల్ని ఏరుకొచ్చి పండించే ప్రయత్నాలు మొదలయ్యాయి కానీ అంత పెద్ద మొత్తంలో కుదరడం లేదు. కానీ దీని గాఢత వల్ల కొన్ని ప్రత్యేక వంటకాలకు దీని రుచి లేనిదే జిహ్వకానదు. అలా అలా చల్లినా చాలు ఫ్లేవర్‌తో ఘుమాయించేస్తుందని స్టార్ హోటళ్ల చెఫ్‌లంటారు. అందుకే వీటిని ఎంత కష్టపడైనా వెతికి మరీ పాకశాలల్లో దాచుకుంటారు. అంతా బానే ఉంది కానీ ఇంతకీ వీటి ధర దగ్గరే బాగా డిస్టర్బ్ అవ్వాల్సి వస్తుంది. కారాన్ని తమాయించుకోగలిగినా ధర దగ్గర మాత్రం ఆగాల్సి వస్తుంది. అందుకే బుల్లివే కదా అని దేన్నీ సిల్లీగా తీసుకోకండి.

లంబోర్గినీ నకిలీ

లంబోర్గిని రెవెన్‌టాన్ కారుని కలలో రైడ్ చేయాలనుకునే వాళ్లు యూరప్‌లో కోకొల్లలు. అంతా అందంగా, పవర్‌ఫుల్‌గా ఉంటుందీ కారు. దీన్ని సొంతం చేసుకోవాలంటే అటు ఇటుగా 13 కోట్లు చెల్లించాలని చాలా మంది కళ్లు మూసుకుని బలవంతంగా కల కనేసి సంతృప్తి పడుతుంటారు. సిజర్ డోర్స్‌ను పైకెత్తినట్లు.. వ్రూమ్ వ్రూమ్ అని ఇంజిన్ మోతెత్తినట్టు ఊహలు బానే ఉంటాయి కానీ ఉక్రెయిన్‌కు చెందిన ఒలెగ్ ఫ్రైకాక్ వాటిని నిజం చేసేసుకున్నాడు. కోట్లు పెట్టి కారు కొని కాదు లక్షల్లో కారుని కాపీ చేసేసి. ఉక్రెయిన్ బస్ ఫ్యాక్టరీలో పనిచేసిన తన అనుభవంతో పాత ఆడీ ఏ8 సెడాన్ చాసిస్‌ను తీసుకుని రెవెన్‌టాన్ ఫైబర్ గ్లాస్ బాడీ ఫిక్స్ చేసేశాడు. ఆడీ ఇంజిన్‌ను వెనుక చక్రాలకు శక్తినిచ్చేందుకు వెనక్కు మార్చాడు. సొంతగా సిజర్ డోర్లను తయారు చేసేసుకున్నాడు. వీటన్నింటికీ అయ్యే ఖర్చు కోసం చాలా త్యాగాలే చేశాడులెండి. నాలుగేళ్ల పాటు కుటుంబ విహార యాత్రలు లేవు. కొత్త ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు లేవు. మందు, పొగ అలవాటుకు సెలవులు. ఇలా చాలానే చేసి ఎట్టాగైతే చిట్టచివరికి సూపర్ కార్‌లో సూపర్‌స్టార్‌లా ఫోజిస్తున్నాడు. మన వీధిలో లంబోర్గినీనా అనుకుని దాన్ని చూసిన వాళ్లంతా విస్తుపోయారట. అంత ఎగ్జాట్‌గా ఉందీ నకిలీ. మేమూ ఒకటి చేసుకుంటాం మాకు నేర్పించండి అంటున్నవారు కొంత మందైతే .. సెలబ్రిటీ మెకానిక్‌గా ఎత్తేస్తున్నారు. ఇంజిన్ల శక్తి పెంచడంతో ఈ కారు గంటకు 240 కి.మీ. వేగంతో దూసుకుపోతోందట. పేపర్ వర్క్ అయిపోతే రోడ్లపైకి వచ్చేస్తుంది.





విజేత

కుస్తీ జీవితం

నిండా పదమూడేళ్ళు నిండకుండానే ఆమెను పెళ్ళి కూతురిని చేశారు. ఏడాది గడిచేసరికి కవల పిల్లలకు తల్లి అయ్యింది. అయితే, అందరిలాగానే అదే జీవితమని ఆగిపోలేదు. పడుతూ లేస్తూ ముందుకు సాగింది. 21 సంవత్సరాలకే అంతర్జాతీయ స్థాయి కుస్తీ పోటీల విజేతగా నిలిచింది. ఆమే నీతూ సర్కార్. ఒకవైపు పూట గడవని పేదరికం వెక్కిరిస్తూ ఉంటే మరోవైపు చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలు మోయాల్సిన పరిస్థితి. ఇవన్నీ ఆమె సంకల్పం ముందు చిన్నబోయాయి. 'కుస్తీ మే సవాల్' అంటోన్న నీతూ సర్కార్ దంగాల్‌ని ఇలా గెలిచింది. ఆమె ఇంటి ముందు గోడపై 'కుస్తీనే నా జీవితం' అంటూ గెలుపు సంతకం చేసింది.

హర్యానాలోని భీవాని గ్రామంలో పుట్టిన నీతూ సర్కార్‌కు జీవితమనే మాటకు అర్థం తెలీని వయసప్పుడే మరిన్ని జీవితాల బాధ్యతలు భారమయ్యాయి. కంపించి పోయే కష్టాలు మీద పడ్డాయి. పదమూడేళ్ళ వయసులోనే నీతూకు 40 సంవత్సరాలు పైబడిన మానసిక పరిస్థితి సరిగాలేని వ్యక్తితో వివాహం జరిగింది. ఆ ఇంట్లో పరిస్థితులు ఎలా ఉన్నా సర్దుకుపోవాలనుకుంది నీతూ. కానీ, పెళ్లైన వారం రోజుల్లోనే నీతూ మామ ఆమెపై అత్యాచారయత్నానికి ప్రయత్నిస్తే..! ఆ దారుణంతో భయపడిన నీతూ ఇంట్లో నుంచి పారిపోయి పుట్టింటికి చేరింది. నీతూ మామ చేసిన దుర్మార్గానికి కుటుంబ సభ్యులకు కోపం కట్టలు తెంచుకుంది. కానీ తప్పు చేసింది వారే. మతి స్థిమితం సరిగా లేని పెద్ద వయసు వాడికి ఏ రకంగా బిడ్డను అదీ పదమూడేళ్లకు కట్టబెట్టారనే వారిని ప్రశ్న వేధించింది. బుద్ధి తెచ్చుకుని నీతూను మళ్లీ ఆ ఇంటికి పంపలేదు. కొన్నాళ్లకు నీతూకు రెండో వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు. అదీ ఏడాది తిరక్కుండానే ఇక్కడే మరో తప్పు జరిగిపోయింది. నీతూను పెళ్లి చేసుకునేందుకు సంజయ్‌కుమార్ ముందుకు వచ్చాడు. అతడు ప్రేమగానే చూసుకునేవాడు. కానీ నీతూ అత్తవారిల్లు ఆర్థికంగా వెనుకబడి ఉండేది. ఆమె భర్త ఓ నిరుద్యోగి. మామ పెన్షన్‌తో ఇంటి ఖర్చులు సరిపెట్టుకునేవాళ్లు. రేషన్ సరుకులు, పిల్లల ఫీజులకు ఆ డబ్బు సరిపోయేవికావు. కొన్నాళ్లకు నీతూకి కవల పిల్లలు జన్మించారు. అప్పటికి నీతూ వయసు 14 సంవత్సరాలు. పిల్లలు పెద్దయ్యే కొద్దీ ఇంటి ఖర్చులు పెరుగుతూ కొన్ని రోజులకే ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా మారిపోయింది.

టీవీలో చూసి..

2010 కామన్‌వెల్త్ పోటీలు భారత్‌లో జరిగాయి. కుస్తీ పోటీలంటే నీతూకి చాలా ఇష్టం. వాటిని టీవీలో ఆసక్తిగా చూసింది. అలా ఓ పోటీలను చూస్తుండగా తానే కుస్తీ ఆడుతున్నట్టు అనిపించింది. తానెందుకు కుస్తీ క్రీడాకారిణి కాకూడదని ప్రశ్న తినేసింది. రెజ్లర్ కలను నిజం చేసుకోడానికి నీతూ తన మానసిక అడ్డంకుల్ని తెగువతో ఒక తెంపు తెంపేసింది. తన జీవితం, తన కలలు, తన తపన, తన లక్ష్యంపై సాధికారంగా నిర్ణయం తనే తీసుకుంది. కుస్తీలో శిక్షణ తప్పనిసరి అని అది లేకుంటే ఇదేం జీవితం అనేంత స్థాయికి వెళ్లిపోయింది. తెల్లవారుజామున 3 గంటలకే లేచి సుదూరంగా ఉన్న కుస్తీ వ్యాయామశాలకు ప్రయాణం మొదలుపెట్టింది. తమ గ్రామానికి 90 కి.మీ.ల అవతల ఉన్న రోహ్తక్‌కు రోజూ వెళ్ళి శిక్షణ తీసుకునేది. రోజులో రెండుసార్లు ప్రయాణం కొనసాగించేది. ఉదయం తర్వాత ఇంటిపని చూసుకుని, మధ్యాహ్నం రెండుగంటలకు మళ్లీ ట్రైనింగ్‌కు వెళ్ళేది. ట్రైనింగ్ అయిపోగానే రాత్రి 9 గంటలకు మళ్లీ ఇంటికి వచ్చేది. అది నీతూ సర్కార్ దినచర్యగా మారిపోయింది. ఓ గృహిణికి అదీ ఇద్దరు చంటి బిడ్డల తల్లికి ఇలాంటి దినచర్య చాలా కఠినం. కుస్తీ పోటీల్లో పాల్గొనాలన్న ఆమె నిర్ణయాన్ని గ్రామస్థులు, నీతూ కుటుంబ సభ్యులు తప్పుపట్టారు. నీతూ అత్తతో సహా వాళ్లంతా ఆమెని ఆపమని భర్తను ఒత్తిడి చేశారు. కానీ, ఇవేమీ ఆమెను ఆపలేదు. భర్తా అడ్డు చెప్పలేదు. అప్పట్లో నీతూ 80 కిలోలు ఉండేది. ఆమె బరువు తగ్గించుకోవడానికి, శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి తెల్లవారుజామున 3 గంటలకు లేచి పరుగెత్తేది. నీతూ కల నెరవేరడానికి కారణం కోచ్ అనే చెప్పాలి. 2011 కోచ్ జెల్లీసింగ్‌ను కలిసింది. 'ఆయనే నాకు స్ఫూర్తినిచ్చారు. 'మేరికోమ్' ముగ్గురు పిల్లల తల్లయినా మెడల్స్ సంపాదించినప్పుడు నువ్వు ఎందుకు నీ కలను నెరవేర్చుకోలేవు' అన్న ఆయన మాటలు నీతూను కుదిపేశాయి. ఆయనే ఆశ్చర్యపోయే ప్రదర్శనిచ్చి అదే ఏడాదిలో జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకుంది నీతూ. ఆ పోటీల్లోనే ఆమె కాంస్యపతకం సాధించింది. దీని తర్వాత ఆమె ఎన్నడూ వెనుకడుగు వేయలేదు. కేరళలో జరిగిన 35 వ జాతీయ పోటీల్లో 48 కిలోల విభాగంలో నీతూ రజక పతకం సాధించింది. 2014లో జాతీయ సీనియర్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం, 2015లో జాతీయ పోటీల్లో కాంస్యంతో సత్తా చాటింది. 2015లో బ్రెజిల్‌లో జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిఫ్ కైవసం చేసుకుని ప్రభంజనం సృష్టించింది. ఒకప్పుడు నీతూకు అడ్డంకులు సృష్టించిన గ్రామస్తులే ఇప్పుడు మరిందరు నీతూలు ఆ గ్రామంలో తయారై పేరు తేవాలని కోరుకుంటున్నారు.

– అమల తిలారు

సందర్భం

70 ఏళ్ల 'గృహ ప్రవేశం'

తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' పుట్టింది 1932లోనైతే ఆ తరువాత ఓ పదేళ్లకు పైగా తెలుగు సినిమాలు పూర్తిగా రంగస్థల నాటకాల తరహాలోనే చిత్రీకరణ జరుపుకుని మూస ధోరణిలోనే ముందుకు సాగాయి. సినిమా కథ, కథనాలు, నటన, చిత్రీకరణల్లో తొలి మార్పులు తెచ్చింది బి.ఎన్.రెడ్డి, కె.వి.రెడ్డిలు. ఆ శైలిని దాటి ఒకడుగు ముందుకు వేసి సినిమా అనేది నాటకాల శైలిని దాటి నటన, సంభాషణల్లో సహజత్వమూ, సినిమాటిక్ పిక్చరైజేషన్ జరుపుకుని తెర మీదికి వచ్చిన తొలి సినిమా 'గృహప్రవేశం'. తెలుగు సినిమాకు సరికొత్త పోకడల్ని మలిచి నగిషీలు దిద్దిన ఎల్.వి ప్రసాద్ దర్శకునిగా తొలి సినిమా కూడా అదే. ఓ సీరియెస్ కథను తేలికగా చెప్పే 'బాంబే టెక్నిక్'ను తొలిసారి వాడి తెలుగులో విజయవంతం చేయడం అప్పట్లో సంచలనం. అదే ఏడాది 'మంగళసూత్రం' చిత్రంలో తొలిసారి ఫ్లాష్ బ్యాక్ శైలిని ఉపయోగించారు. ఒకే ఏడాది రెండు కొత్త ప్రయోగాలు తెలుగు సినిమాలో జరిగాయి. 1946లో విడుదలైన 'గృహప్రవేశం' సినిమా ఈ ఏడాది అక్టోబర్ 4న 70 వసంతాలు పూర్తి చేసుకోబోతున్నది. ఈ సందర్భంగా ఆ చిత్రం గురించి ప్రత్యేక కథనం.

- హెచ్.రమేష్‌బాబు
94409 25814

1938లో సారథి చిత్ర నిర్మాణ సంస్థ ఆవిర్భావం తెలుగు సినిమా చరిత్రలో ఒక మైలురాయిగా చెప్పుకోదగినది. ఈ సంస్థ సినిమాలు తీయడమంటే వ్యాపారం మాత్రమే కాదు సామాజిక బాధ్యత కూడా అందులో ఇమిడి ఉండాలనే సదాశయంతో గొప్ప సినిమాలు తీశారు. తొలిచిత్రం 'మాలపిల్ల' (1938)లో కులం సమస్యను, రైతుబిడ్డ (1939)లో రైతుల వ్యధలను చూపితే తరువాతి 'పత్ని' (1942)లో స్త్రీ శక్తిని చాటి 'పంతులమ్మ' (1943)లో రాజకీయాలను తూర్పారబట్టారు. తరువాతి 'మాయాలోకం' (1945) జానపదం. ఈ చిత్రాలన్నింటికి అభ్యుదయ వాది గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వం వహించారు. అయితే 1946 నాటికి కొత్త సినిమా 'గృహప్రవేశం' నిర్మాణం ప్రారంభించే నాటికి రామబ్రహ్మం అనారోగ్యం పాలు కావడంతో చల్లపల్లి రాజా (సారథి నిర్మాత) వారు తన సోదరుడు వై.శివరామప్రసాద్, కె.ఎస్.ప్రకాశరావులకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. కె.ఎస్.ప్రకాశరావు అప్పటికే సారథీ వారి 'పత్ని'లో హీరోగా నటించి ఉన్నారు.

'గృహప్రవేశం' చిత్రానికి కథ, మాటలు రాసింది త్రిపురనేని గోపీచంద్. సారథీ సంస్థతో తొలినాటి నుండి అనుబంధం ఉన్నవాడు. 1939 నాటి రైతుబిడ్డ చిత్రానికి రచన చేయడమే గాక సహ దర్శకునిగా పని చేశారు. తరువాత వీరిదే 'మాయాలోకం' (1945) సినిమాకు కూడా రచన చేశారు. ఇక 'గృహప్రవేశం' నాటికి సినిమాను పూర్తిగా ఆకళింపు చేసుకున్నారాయన. ఆ సినిమాకు

అనుకోని మార్పులు

ఎల్.వి.ప్రసాద్ బొంబాయిలో తొలిటాకీతో మొదలు పలు తెలుగు హిందీ చిత్రాల్లో నటించడమే గాక ప్రొడక్షన్ వ్యవహారాల్లో మంచి అనుభవం సంపాదించి ఉన్నారు. పృథ్వీరాజ్ కపూర్ పృథ్వీ థియేటర్స్‌లో నటునిగా, సహాయ దర్శకునిగా పని చేసి ఉన్నారు. హెచ్.ఎం.రెడ్డి వద్ద శిష్యరికం చేసి ఉండటం కూడా అదనపు అర్హతగా నిలిచింది. అసిస్టెంట్‌గానే గాకుండా హీరోగా కూడా ఎల్.వి.ప్రసాద్ ఎంపికైనారు. తనకు హెచ్.ఎం.రెడ్డి వద్ద సహచరుడుగా ఉన్న పాలవాయి రామకృష్ణను వెళ్లి హీరోయిన్‌గా భానుమతి నటించడానికి ఒప్పించమన్నారు. అప్పట్లో తాము తీయాలనుకున్న 'రత్నమాల'ను వాయిదా వేసి భానుమతిని 'గృహప్రవేశం' సినిమాలో నటించడానికి ఒప్పించారాయన. ఇలా అంతా సిద్ధమైన సమయంలో అప్పటి వరకూ దర్శకత్వం చేయాల్సిన గోపీచంద్ స్థానంలో ఎల్.వి.ప్రసాద్‌ను ప్రకటించాల్సి వచ్చింది. గోపీచంద్ కొత్తవాడని (దర్శకత్వానికి) అతడిని నమ్మి డబ్బు పెట్టలేమని డిస్ట్రిబ్యూటర్లు వెనక్కి తగ్గటంతో ఎల్.వి.ప్రసాద్‌ని దర్శకత్వ బాధ్యతలు అప్పగించారు. గోపీచంద్ స్క్రిప్టు రైటర్‌గానే ఉండిపోయారు.

ఈ పరిణామాల తరువాత సినిమాను చూస్తేనే అర్థమైపోతుంది. గోపీచంద్ సీరియస్‌గా రాసిన స్క్రిప్టులో ఎల్.వి.ప్రసాద్ డైరెక్టర్ కాగానే కామెడీ డామినేట్ చేసిందని, బొంబాయి శైలికి భిన్నంగా తెలుగు సినిమాలుంటాయి. కానీ ఎల్.వి.ప్రసాద్ తనదైన స్టైల్‌లో సినిమాను తీశారు. మెలో డ్రామాను తగ్గించడం కోసం కామెడీనీ వాడుకున్నారు. సినిమాలో ఇతివృత్తం సామాజిక సమస్యే అయినా దాన్ని హాస్యస్ఫోరకంగా చెప్పే ప్రయత్నం చేశారు ప్రసాద్. అందులో ఆయన సఫలీకృతుడైనారు కూడా.



భానుమతి నటన శిఖర స్థాయిలో ఉంటుంది. అప్పటికే ఆమె 'స్వర్గసీమ'లో పెద్ద స్టార్‌డమ్‌ని అందుకుని ఉన్నా, గృహ ప్రవేశంలోని నటన దానికి ఒకడుగు ముందుకే పడింది. ఇక సి.ఎస్.ఆర్. రమణారావుగా తెరపై వీర విహారమే చేస్తాడు. "హల్లో మైడియర్ తులశమ్మక్కా" అన్న అతని డైలాగ్ ఆ రోజుల్లో ఊతపదమై వ్యాపించింది. ఆయన దర్శకత్వం కూడా గోపీచంద్‌నే చేయమన్నారు. సినిమా వ్యవహారాలు చూస్తున్న కె.ఎస్. ప్రకాశరావు డైరెక్షన్‌లో సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవాడిని సహాయ దర్శకునిగా నియమించుకోవాలని బొంబాయి నుండి ఎల్.వి.ప్రసాద్‌ను మద్రాసుకు తీసుకువచ్చారు.

ఆంధ్ర పత్రిక 1946 అక్టోబర్ 13 నాటి సంచికలో "గృహప్రవేశం" సమీక్షలో ఇలా రాశారు.

ఫిలిం ద్వారా ఈ బోధ చేసేందుకు కథకుడు శ్రీ గోపీచంద్, కాలగతిని గుర్తించక అపమార్గానపోయే పాత్ర ఒకటీ, కాలగతిని గుర్తించి, తదనుసారం నవీన భావాలతో, నవ్యాశయాల కోసం కృషి చేసే ఒక పాత్రనూ సృష్టించి, ఈ రెంటికీ ఒక దృక్పథం రీత్యా ఘర్షణ కలిగించి, తుదకు అపమార్గాన పోయే పాత్ర సవ్యమైన మార్గంలోకి వచ్చి తీరవలసిన ఆవశ్యకతను నిరూపించారు. మొదటిది నాయక పాత్ర, రెండవది నాయిక పాత్ర, ఈ రెండు పాత్రల ఘర్షణకు దోహదమిచ్చేందుకు విభిన్న ప్రకృతులు గల పాత్రలను సృష్టించి కథ రసవత్తరంగా సాగే మార్గం యేర్పాటు చేశారు'.

సినిమా అంతా టేకింగ్స్‌లో నూతన పోకడలతో సాగుతుంది. సీరియస్ విషయాన్ని కామెడిగా చెప్పడంలో సఫలీకృతుడైన ఎల్.వి.ప్రసాద్ దర్శకుడిగా తొలిచిత్రమే అయినా పరిణతి చెందిన వాడిగా నిరూపించుకున్నాడు. కానీ హీరోగా తన పాత్ర కాస్త తగ్గించుకున్నట్లుగా కనిపిస్తుంది.

సరసన లలితగా నటించిన జూనియర్ శ్రీరంజని చాలా మందికి శోకపాత్రల నాయికగానే తెలుసు. కానీ ఆమెతో చలాకీ పాత్ర చేయించి మెప్పించడం దర్శకుని ప్రతిభకు నిదర్శనం.

గృహప్రవేశం విడుదలైన 1946లో మొత్తం 10 తెలుగు సినిమాలు విడుదలైనవి. వీటిలో రెండే సాంఘికాలు. 'గృహప్రవేశం' మొదటిదైతే రెండోది కోన ప్రభాకరరావు 'మంగళసూత్రం'. 'మంగళసూత్రం'లో తొలిసారిగా ఫ్లాష్ బ్యాక్ దృశ్యాలు కనిపిస్తే, 'గృహప్రవేశం'లో బాంబే టెక్నిక్‌గా చెప్పుకునే సాంకేతికత కనిపిస్తుంది. ఇది తెలుగు సినిమాను సాంకేతికంగా మలుపు తిప్పిన పరిణామం.

సినిమాలోని 'బానిసలం బానిసలం',

'వెనుకడెదేలనోయి' స్వర్గసీమ కులుకు, అమ్మా అమ్మా హాలాహలమెగయునో పాటల వరుసలు కర్ణ ప్రియంగా ఉంటవి. సంగీతం చేసినది బాలాంత్రపు రజనీకాంతరావు. ఆకాశవాణి ఉద్యోగి కావడం వల్ల నళినీకాంతరావు పేరుతో చేశారు. సినిమా కథనాన్ని నడిపించడంలో కొత్తరీతులు తొక్కిన ఎల్.వి.ప్రసాద్ తను తరువాత తీసిన 'పెళ్లి చేసి చూడు', 'మిస్సమ్మ' చిత్రాలకు పునాదులు 'గృహప్రవేశం'లో పడ్డాయనిపిస్తుంది. 1946 అక్టోబర్ 4న విడుదలైన గృహప్రవేశం ఆ తరువాత సింహళభాషలో కూడా విడుదలవుతుందని ప్రకటన వచ్చింది.

అయితే చివరగా రెండు మాటలు చెప్పుకోవాలి. గృహప్రవేశం సినిమాకు అనుభవం లేదన్న సాకుతో దర్శకత్వం అవకాశం రాకపోయినా 1950లో "లక్ష్మమ్మ" సినిమాకు దర్శకత్వం వహించి, పోటీగా వచ్చిన స్టార్స్ నటించిన "లక్ష్మమ్మ కథ"ను వెనకవేసి విజయం సాధించిన వాడు త్రిపురనేని గోపీచంద్.

గృహప్రవేశంతో దర్శకుడైన ఎల్.వి.ప్రసాద్ ఆ తరువాత భారతదేశం గర్వించదగిన దర్శక, నిర్మాతగా ఎదిగి తెలుగు కీర్తిని ఎల్లడలా చాటారు.

✦

సామాజిక సమస్యను సహజంగా..

భారత స్వాతంత్ర్యం సిద్ధించే సంధికాలంలో రూపొందిన సినిమా గృహప్రవేశం. హీరోయిన్ స్త్రీ వాదిగా కనిపిస్తే, హీరో లోకంలో సకల బాధలకు స్త్రీయే కారణమని ప్రచారం చేస్తుంటాడు. విద్యావంతురాలు, చైతన్యవంతురాలు అయిన జానకి (భానుమతి) స్త్రీ స్వేచ్ఛ పట్ల సానుకూల దృక్పథాన్ని ప్రకటిస్తుంది. హీరో సోమలింగం (ఎల్.వి.ప్రసాద్) స్త్రీ ద్వేషి. అతని సభను తన స్నేహితులతో కలిసి భగ్నం చేసి ఆ తరువాత ఆయనను అవమానించేలా వ్యంగ నృత్యనాటిక నొకదాన్ని ప్రదర్శిస్తుంది. ఇంట్లో సవతి తల్లి తులశమ్మ (హేమలత) వేదింపులు అనుభవించే జానకి ఒక దశలో ఆమె తమ్ముడు రమణారావు (సి.ఎస్.ఆర్.) రాకతో ఇంట్లో పరిస్థితులు మారతాయి. రమణారావు నాటకాల రాయుడు. అప్పటికే ఆయన ఓ నాటకాలమ్మాయి లలిత (జూనియర్ శ్రీరంజని)తో సహజీవనం చేస్తుంటాడు. కానీ తులశమ్మ జానకినిచ్చి పెళ్లి చేయాలనుకుంటుంది. అంతకు మునుపే మోసం చేసి సోమలింగం ఒడిలో ఉన్నట్టుగా దిగిన ఫొటో ఒకటి పేపర్లో అచ్చయి అతని ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది. ఈ పరిణామాలన్నీ చూసిన తులశమ్మ రమణారావుతో జానకి పెళ్లి చేయాలని నిర్ణయిస్తుంది. ఆ రాత్రి ఇంట్లోంచి బయటపడిన జానకి తాగుబోతుల నుండి తప్పించుకోవడానికి సోమలింగం ఇంట్లోకెళ్లి తల దాచుకుంటుంది. తన ఆశయం భంగం చేయడానికే వచ్చిందనుకుంటాడు. పోలీసులకు పట్టివ్వబోతే భార్యలా నటించి తప్పించుకుంటుంది. ఇంతలో సోమలింగం శిష్యుడు ఆచారి ఇదంతా గమనించి సోమలింగంపై దాడి చేస్తాడు. విరక్తి కలిగి సన్యాసం స్వీకరిస్తాడు. కథలో చాలా మలుపులు తిరిగి సోమలింగం లలితను ప్రేమించడం మొదలుపెడతాడు. రమణారావు ఎత్తుకు పైఎత్తు వేసి లలితతో అతని పెళ్లి జరిపిస్తారు. జానకి తండ్రి సోమలింగానికి జానకినిచ్చి పెళ్లి చేసి స్త్రీ పురుషులు సమానమే. ఇరువురు కలిసి సమాజ సేవ చేయాలని ఉద్బోధ చేస్తాడు. భవ్యాశయాల 'గృహప్రవేశం' ఇదేనని సందేశమిస్తారు.

గృహప్రవేశం ఒక ట్రెండ్ సెట్టర్

"మా నాన్న గోపీచంద్ రచన చేసిన చిత్రాలలో 'రైతుబిడ్డ' తరువాత నాకు ఇష్టమైన చిత్రం 'గృహప్రవేశం'. పై రెండు చిత్రాలలో చాలా వైవిధ్యం ఉంది. రైతుబిడ్డ'లో రైతాంగ సమస్యలు, జమిందారి వ్యవస్థపై తిరుగుబాటును చూపిస్తాడు. ఇందులో తాతగారు రామాస్వామి ప్రభావం కనిపిస్తుంది. 'గృహప్రవేశం' పూర్తిగా తనదైన ఆదర్శాలతో రాసిన రచన. స్త్రీ వాదానికి తెర తీస్తాడు. అభ్యుదయ భావంతో సామాజిక సమస్యలను వినోదాత్మకంగా చెప్పడమేగాక కథ, స్క్రీన్ ప్లే, నటన, పాటలు, సంగీతం, డైరెక్షన్ వంటి అంశాలలో కొత్త పోకడలు పోయి రూపొందిన "గృహప్రవేశం" ట్రెండ్ సెట్టర్.

- సాయిచంద్

ఉనికి

సమాజం ఉపరితలంపై
చెల్లుబాటవుతున్న
బంధాలు
మాటల్ని వెలేసిన మౌనాల తోడుగా
నేలమాళిగల్లో సంతోషాలకై
తచ్చాడుతూ
నిర్జీవ యాంత్రికతలో
మళ్లీ మళ్లీ తడబడుతూ
అయోమయం నుండి
అనిశ్చితిలోకి
అనిశ్చితి నుండి
మళ్లీ అసహాయతలోకి
జారితే..
కావాల్సింది
సానుభూతో
సహానుభూతో కాదు
సహజానుభూతి
మెదళ్లల్లో పోటెత్తాల్సింది
విలువల ఉనికి.

- కళ్యాణదుర్గం స్వర్ణలత
9848626114

ఒక జల ధార కోసం

ఆకాశమంతా అల్లరిచేసి
చినుకు మొలిస్తే
మట్టిలోంచి మనిషి
చివురిస్తాడు.
చినుకు పూల కోసం
ఆకాసమంత దోసిళ్లు
చూచుకుంటాడు.
నీటి జల్లులు
అవసరాలుగా వేలాడతాయి.
ఒక తడి వేకువ కోసం
విధ్వంసపు చూపులు
రాలుతుంటాయి.
ఎండకు నీరసించిన మొక్కలా
నీటి ఆశలు వాడి పోతూ
ఒక్కో ఆవేదన ఒక్కో గొంతై
వినిపిస్తుంది.
పెంచే మొక్కల్లో
జలధార దాగివున్నట్లు
రహస్యం బోధపడుతుంది.

- గవిడి శ్రీనివాస్
8722784768

చిరునవ్వుతో..

♦ వోర్సెస్టర్ ప్రాంతానికి చెందిన ఫ్రీలాన్స్ కళాకారుడు హార్వే బాల్ స్మైలీ ఫేస్ రూపకర్త. 52 ఏళ్ల క్రితం (1963)లో స్టేట్ మ్యూచువల్ (ప్రస్తుత హ్యానోవర్) ఇన్సురెన్స్ కంపెనీ కోసం పది నిమిషాల్లో హార్వే 'స్మైలీ' చిత్రాన్ని గీశాడు.

♦ హార్వే 45 డాలర్లకి గీసిన స్మైలీ ఫేస్ బొమ్మకి కాపీరైట్ తీసుకోలేదు. దాన్ని చూసి గీసి ఉచితంగా అందరూ చిరునవ్వుల్లో మునిగిపోవాలనుకున్నాడేమో. ఎందుకంటే నవ్వు ఫ్రీ.

♦ నవ్వు ద్వారా అధికంగా విడుదలయ్యే ఎండార్ఫిన్లు వత్తిడి నుండి ఉపశమనాన్ని కలిగిస్తాయి.

♦ అమెరికా తపాలా కార్యాలయం 1999లో స్మైలీ ఫేస్ స్టాంపుని విడుదల చేసింది.

♦ ఫారెస్ట్ గంప్ చిత్రం ద్వారా 1994లో స్మైలీ ఫేస్ చిత్ర సీమలో ప్రవేశించింది.

♦ ఉత్తర అమెరికా, ఆసియా, యూరప్, ఆఫ్రికా ఖండాలో ఎంతో మంది ప్రముఖులు స్మైల్ అంబాసిడర్లుగా పనిచేస్తున్నారు.

♦ ఆరోగ్యం, ఉల్లాసాలని పెంపొందించేందుకు ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ మొదటి శుక్రవారం నిర్వహిస్తున్నారు.

♦ 1999 అక్టోబర్ 1న వోర్సెస్టర్, మసాచుసెట్స్‌లో ప్రపంచ మొదటి స్మైల్ దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుండి స్మైలీ ఫేస్‌లు ఆనందాలకి చిహ్నంగా మారాయి.

♦ పిల్లలు నిద్రలోనే నవ్వుతుండే లక్షణాలు పుట్టిన వెంటనే కాదు తల్లి కడుపులో ఉన్నప్పుడు కూడా చక్కగా చిరునవ్వుల్ని చిందిస్తారట.

♦ ఒక్కో భావోద్వేగాన్ని పలికించగల మొత్తం 19 రకాల నవ్వులున్నట్టు శాన్‌ఫ్రాన్సిస్కో విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. వీటిని తక్కువ కండరాలని, ఎక్కువ కండరాలని కదిలించగలిగే రెండు రకాల నవ్వులుగా విభజించారు. మన రంగస్థల కళాకారులు ఎప్పటి నుంచో వికటాట్టహాసాలను, మందహాసాలను వేర్వేరుగా ఎప్పుడో ప్రదర్శించేశారనుకోండి. ఇలా పరిశోధించి చెప్పడంతో శాస్త్రీయత టచ్ వచ్చింది.

♦ 2001లో హార్వే బాల్ మరణానంతరం స్థాపించిన వరల్డ్ స్మైల్ ఫౌండేషన్ అన్ని దేశాల మధ్య ప్రేమ, శాంతిని నెలకొల్పే సందేశంతో ప్రపంచ వ్యాప్తంగా నవ్వుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.



♦ 1971లో 50 మిలియన్ల స్మైలీ ఫేస్ బటన్‌లు అమ్ముడయిన రికార్డులున్నాయి. అంటే ఎంత మంది చిరునవ్వుతో గుడ్ మార్నింగ్‌ల చెప్పడానికి ఉపయోగపడ్డాయో ఈ స్మైలీ బటన్లు. సామాజిక మాధ్యమాల్లో స్మైలీ ఫేస్ పదే పదే పలకరిస్తూ మూడ్‌ను మార్చేస్తుండటం ఇప్పటి వారికి అనుభవమే. అప్పట్లో బటన్‌లు అలా ఉపయోగపడేవి.

♦ ప్రపంచ దేశాల్లో పసుపు పచ్చ వస్త్రాలను ధరించిన వందలాది మంది అతిపెద్ద స్మైలీ ఆకారాలను ఏర్పరిచి ప్రపంచ రికార్డు కోసం ప్రతి ఏటా పోటీ పడుతుంటారు.

నాన్నా.. నన్ను క్షమించు!

కథ

- రాజాబాబు కంచర్ల
9490099231



'నేను తప్పుచేశాను... నన్ను క్షమించు నాన్నా... ఏ కొడుకూ తండ్రి పట్ల ప్రవర్తించని విధంగా నేను నీ పట్ల ప్రవర్తించాను' అంటూ.. సత్యమూర్తి కాళ్లపై పడతాడు రవీంద్ర.

'ఇందులో ఎవరి తప్పూ లేదురా... కాల ప్రభావం.. అంతే. వృద్ధాప్యాన్ని సామాజిక విషయంగా చూడని ఆధునిక సమాజపు అమానవీయత ఇది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి మాట్లాడేవారు... వారు ఇలా మాట్లాడే స్థాయికి ఎదిగేందుకు ఓ నిచ్చెన మెట్టుగా మారిన పునాది గురించి మర్చిపోతున్నారు. అందరూ ఉండి ఎవరూలేని అనాథలై.. కాస్తంత ప్రేమను కూడా పంచే వారులేక అల్లాడిపోతున్న ముసలి ప్రాణాల దీనస్థితికి నేటి సమాజ రోగగ్రస్థ దుస్థితే కారణం. ఈ సమాజంలో మనమూ భాగమేగా.. ఇందులో ప్రత్యేకంగా నీ తప్పు మాత్రం ఏముంది గనుక... లే నాన్నా... లే..' అంటూ కొడుకును పైకి లేపుతాడు.

'నాన్నా...' అంటూ తండ్రిని కౌగిలించుకొని బావురుమంటాడు రవీంద్ర.

'ఇన్నాళ్లూ నీ గొప్పతనం తెలుసుకోలేని గుడ్డివాణ్ణి. పద నాన్నా మనింటికెళ్దాం..' పొర్లి పొర్లి వస్తున్న దుఃఖాన్ని అదుపు చేసుకుంటున్నాడు. తాను చేసిన తప్పు శూలంలా గుచ్చుతోంటే.. విలవిల్లాడిపోతున్నాడు.

'మావయ్యా... అసలు తప్పంతా నాది. దీనికంతటికీ నా మూర్ఖత్వమే కారణం. నన్ను క్షమించండి. దయచేసి ఇంటికి వెళ్దాం రండీ...అంటూ కాళ్లావేళ్లా పడుతుంది శ్యామల.

'తాతయ్యా... నేను కూడా నిన్ను బాధ పెట్టాను. ఇకనుంచీ మీరు చెప్పినట్టే వింటాను. రండి తాతయ్యా మనింటికెళ్దాం..' అంటూ పదేళ్ల మనవడు సత్యమూర్తి కాళ్లను వాటేసుకుంటాడు.

'అలా మాట్లాడకురా చిట్టి తండ్రీ.. నువ్వు పసిపిల్లాడివి... ఇవన్నీ నీకెలా తెలుస్తాయి చెప్పు. అయినా నేనెక్కడికి వెళ్తాను. ఇక్కడేగా వుంటాను. నువ్వెప్పుడు కావాలంటే అప్పుడు రావొచ్చు...' అంటూ ఆప్యాయంగా మనవడి తలపై ముద్దు పెట్టుకుంటాడు.

'రవీ.. ఇక మీరు వెళ్లండి. రావాలనుకుంటే మీరు ఎప్పుడైనా రావొచ్చు. ఈ ఆశ్రమంలో చాలా మందే వున్నారు కదా... వాళ్లతో కాలక్షేపం అవుతుందిలే. మిమ్మల్ని చూడాలనిపిస్తే... నేనే ఫోన్ చేస్తా.. సరేనా. ఇక వెళ్లండి' అంటూ ఆశ్రమం లోపలికి కదిలాడు సత్యమూర్తి... ఉబికివస్తోన్న కన్నీటిని వాళ్లకి కనబడనీయకుండా...

• • •

సత్యమూర్తి టీచర్‌గా రిటైర్ అయ్యాడు. చాలా ఏళ్ల క్రితమే భార్య కాలం చేసింది. ఎక్కువగా పుస్తకాలతోటే ఆయన కాలక్షేపం. సాయంత్రాలు మాత్రం.. దగ్గరలోనే ఉన్న పార్కు వరకు వెళ్లొస్తుంటాడు. అక్కడున్న కాసేపు ఎంతో ప్రశాంతంగా వుంటుంది. కొడుకు రవీంద్ర బ్యాంకులో పనిచేస్తాడు. కోడలు శ్యామల, మనవడు చిన్నూ. ఇదీ.. సత్యమూర్తి కుటుంబం.

రవీంద్ర మంచివాడే.. కానీ తన అభిప్రాయాన్ని భార్యకు గట్టిగా చెప్పలేడు.

ఈమధ్య ఇల్లు తరచూ రణరంగంలా మారుతోంది. చిన్న విషయానికి కూడా కోడలు రాద్ధాంతం చేస్తోంది. నోటికి ఎంతొస్తే అంతా అనేస్తోంది.

పార్కులో కూర్చున్న సత్యమూర్తికి ఆ రోజు ఉదయం జరిగిన సంఘటన పదే పదే గుర్తొస్తోంది. ఎంత మర్చిపోదామన్నా మర్చిపోలేక పోతున్నాడు. ఇంటా బయటా ఎంతో గౌరవంగా బతికి, కోడలితో మొఖం వాచేటట్లు చివాట్లు తినాల్సి వచ్చిందే అని తెగ మథనపడిపోతున్నాడు.

'శ్యామలా..శ్యామలా.. ఇప్పటివరకు లేవకపోతే ఎలా.. చిన్నూని స్కూలుకి తీసుకెళ్లాలి. నాకు బ్యాంకుకు టైమ్ అవుతోంది. లేవాలి తర్వాగా...' అప్పుడే మార్నింగ్ వాక్‌కు వెళ్లొచ్చిన రవీంద్ర... ఉదయం 7గంటలైనా నిద్రమంచం దిగని భార్యను హడావుడిగా లేపుతున్నాడు.

ఈమధ్య శ్యామలకు మరీ బద్ధకం పెరిగిపోతోంది. టైమ్‌కి లేవకపోవడం వల్ల తరచూ చిన్నూ స్కూలుకి కూడా లేట్ అవుతోంది. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోగా, గట్టి గట్టిగా కేకలేస్తోంది. వంటగదినంతా గిన్నెల శబ్దాలతో రణరంగంలా మార్చుతోంది.

ఇవాళా అదే జరిగింది.....

వెదవ సంతాని వెదవ సంత.. ప్రశాంతంగా పడుకోడానికి లేదు. కాఫీలు టిఫినీలు వండి వార్చడంతోనే సరిపోతోంది జీవితమంతా... అని పెద్దగా కేకలేస్తూ వంటగదిలోకి వెళ్లింది. వెళ్లింది మొదలు గిన్నెలతో పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ... అందరినీ తిడుతూనే వుంది.

ఈ గొడవంతా హాల్లో కూర్చొని పేపర్ చదువుతోన్న సత్యమూర్తికి వినిపిస్తూనే వుంది.

ఉండబట్టలేక లోపలికెళ్లి.. 'ఎందుకమ్మా... నీ

పని నువ్వు చేసుకోడానికి కూడా ఇంత రాద్ధాంతం చేస్తున్నావు. నువ్వు కాస్త ముందు లేస్తే పోయేదేముంది. అర్ధరాత్రి వరకూ టీవీ చూస్తూనే వుంటావు. త్వరగా పడుకుంటే... ఈ గొడవంతా ఉండదు కదా..'అంటూ సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు.

ఆ మాటలకు మరింత రెచ్చిపోయింది శ్యామల.

'.... అంటే నేనేం పని చేయకుండా టీవీ ముందే కూర్చుంటున్నానా. మీ అందరూ మెక్కడానికి ఎక్కడనుంచి వస్తోంది నేను చెయ్యకపోతే. అసలు మా మొగుడు పెళ్లాం మధ్య మీరెందుకు తలదూర్చుతారు. ఒక మూలన పడివుండక... మాకేమన్నా లక్షలు లక్షలు సంపాదించి పెట్టారా..? మీకన్నీ టైమ్‌కి అమర్చిపెట్టడానికి. పాతకాలంనాటి ఈ కొంప తప్ప...'

శ్యామల మాటలు తూటాల్లా తగులుతుంటే... మ్లానమైన ముఖంతో అక్కడినుంచి నెమ్మదిగా తన గదిలోకి వెళ్లిపోయాడు.

శ్యామల ఇన్నిమాటలంటున్నా... రవీంద్ర ఏం మాట్లాడకపోగా... బ్యాంకుకు వెళ్లేందుకు తన పని తాను చేసుకుపోతున్నాడు.

ఇది ఈ ఒక్కరోజు సంఘటన కాదు. సత్యమూర్తి రిటైర్ అయిన నాటి నుండి రోజూ ఏదోక విషయంలో గొడవ జరుగుతూనే వుంది. చివరకు చిన్నూకు ఏదైనా మంచి చెప్పబోయినా... ఛీత్కరణే ఎదురవుతోంది.

తను ఎక్కడ తప్పు చేస్తున్నాడో సత్యమూర్తికి ఎంతకీ అర్థం కావడంలేదు. వృద్ధాప్యం ఇంత భారంగా వుంటుందా..? పెద్దరికానికి విలువే లేదా..? అటువంటప్పుడు ఇంట్లో ఉండి ఉపయోగం ఏమిటి..? ఆ రోజంతా మదనపడుతూనే ఉన్నాడు. గదిలోనుంచి బయటకి రాలేదు.

రవీంద్ర మాత్రం హడావుడిగా రెడీ అయ్యి... చిన్నూని తీసుకొని వెళ్లిపోయాడు.

టిఫిన్ చేయడానికి గానీ, భోజనం చేయడావికి గానీ సత్యమూర్తిని శ్యామల పిలవలేదు. ఆయనా వెళ్లలేదు. ఎవరి గదిలో వాళ్లు ఉండిపోయారు.

ఉదయం నుంచి ఏమీ తినకపోవడంతో కాస్త నీరసంగా అనిపించినా... సాయంత్రం పార్కుకు వెళ్లి.. రోజూ కూర్చునే చోట కూర్చొన్నాడు. మనసు మనసులో లేదు. ఇప్పుడు తానేం చేయాలి. వీళ్లకి భారమయ్యానా? ఈ సమస్యకు ఏదోక పరిష్కారం చూడాలి...'

'సార్..సార్...' పార్క్ వాచ్‌మెన్ పిలుస్తున్నాడు.

ఆలోచనల నుండి బయటపడిన సత్యమూర్తి.. ఏమిటన్నట్టుగా అతనివైపు చూశాడు.

'సార్... పార్క్ మూసేసే టైమ్ అయింది... మీరెప్పుడూ ముందే వెళతారు కదాని..' అంటూ మధ్యలోనే ఆపేశాడు.

ఒకరిద్దరు తప్ప పార్కులో ఎవరూ లేరు. ఆలోచనల్లోపడి చాలా సమయమే గడిపేశాడు. టైమ్ 7గంటలైంది. చీకటి పడింది. నెమ్మదిగా లేచి ఇంటిముఖం పట్టాడు.

• • •

సత్యమూర్తి ఇంటికొచ్చేసరికి... రవీంద్ర, శ్యామల మధ్య ఏదో వాగ్యుద్ధం నడుస్తోంది. గుమ్మం దగ్గరే ఆగిపోయాడు.

'మనం వేరే వెళ్లిపోదాం. ఈ ఇల్లు... ఈ వాతావరణం నాకు నచ్చలేదు. ముఖ్యంగా మీ నాన్న. ఇక ఒక్కరోజు కూడా ఈ ఇంట్లో వుండేదిలేదు. ఆయనతో మాటలు పడాల్సిన అవసరం నాకులేదు. లేదంటే చెప్పండి.. మా పుట్టింటికి వెళ్లిపోతా...' అంటూ ముక్కు చీదుతోంది.



'అదికాదు శ్యాము.. ఆయన పెద్దాయన. ఆయన్ని వదిలి ఎక్కడికి వెళతాం. నువ్వే ఏదోవిధంగా సర్దుకో... ప్లీజ్...'

'మనం వేరే వెళదాం నాన్నా... తాతయ్య నన్ను కూడా తిడుతున్నారు' అంటూ చిన్నూ.

'తప్పు నాన్నా.. తాతయ్యని అలా అనకూడదు...'

'మీరేం చేస్తారో నాకు తెలియదు. రేపటికల్లా చెప్పండి.. వేరే వెళ్లాలో.. నేను మా పుట్టింటికి వెళ్లాలో...' సత్యమూర్తి లోపలికి రావడం చూసి విసురుగా వాళ్ల గదిలోకి వెళ్లిపోయింది శ్యామల.

'నాన్నా... మరీ...' ఎలా చెప్పాలో తెలియక గుటకలు మింగుతున్న కొడుకు అవస్థను గమనించి...

'రవీ.. నేనంతా విన్నానురా..'

'ఇప్పుడేం చేయాలో అర్థం కావడంలేదు... మీరైనా తన విషయంలో జోక్యం చేసుకోకుండా వుండాల్సింది. ఎప్పుడూ ఏదోకటి అంటుంటారు...' సున్నితంగానే అన్నా... రవీంద్ర మాటల్లోని అసహనం కాస్త గట్టిగానే తాకింది సత్యమూర్తిని.

'తను వినేలా లేదు నాన్నా... అందుకని...'

'వద్దురా... మీరెక్కడికీ వెళ్లక్కర్లేదు. ఇది మీ ఇల్లు. నిశ్చింతగా వుండొచ్చు. ఇక నా సంగతంటావా.. నేను వృద్ధాశ్రమంలో చేరాలనుకుంటున్నా. రేపు నన్ను అక్కడ దింపేసి వస్తే చాలు...' సత్యమూర్తి గొంతు గాద్గదమైంది.

'వద్దు నాన్నా... ఇది మీరు సంపాదించింది. మేమే వెళతాం..'

'ఏ తల్లిదండ్రులైనా సంపాదించేది పిల్లల కోసమే రవీ... నీది నడిచేకాలం... నీ కొడుకుది రాబోయే కాలం... నాది వెళ్ళే కాలం. నేనెక్కడున్నా గడిచిపోతుంది...'

'నాన్నా...' తండ్రి నిర్ణయం రవీంద్రను నిస్సహాయుడ్ని చేసింది.

'నేనేం బాధ పడటంలేదు రవీ.. బలవంతంగా వృద్ధాశ్రమంలో చేరవలసి వస్తే బాధ తప్పు, నా అంతట నేనుగా వెళుతున్నప్పుడు బాధపడాల్సిందేముంది. పట్టణాల్లో ఊపిరాడని ఉరుకులు పరుగుల మధ్య కొట్టుకుపోతున్న జీవితాలు మీవి. మీకు భారంగా ఉండలేను. నా ఛాదస్తాన్ని మీ మీద రుద్దలేను.'

'నాన్నా.. మరోసారి ఆలోచించండి...' అన్నాడు తండ్రి ఇలాంటి నిర్ణయం తీసుకుంటాడని ఊహించని రవీంద్ర..

'లేదు రవీ.. నా నిర్ణయంలో మార్పులేదు. వీలైతే రేపు సెలవు పెట్టు...'

మళ్లీ ఎప్పటికి చూస్తానో... పుత్రవాత్సల్యం ఒక్కసారిగా పొంగుకొచ్చింది... రవిని కౌగలించుకున్నాడు.

'రవీ...రేపు ఇదే పరిస్థితి నీకు రాకుండా చూసుకో...' అనాలనుకున్నాడు. కాని.. మమకారం గొంతుకు అడ్డుపడింది. మనసులోని మాట గొంతులోనే ఆగిపోయింది. ఒకసారి రవి వైపు చూశాడు. ఇదే చివరిసారి అన్నంతగా... మెల్లగా తన గదిలోకి వెళ్లిపోయాడు.

● ● ●

ఉదయం 10గంటలకు కారు వృద్ధాశ్రమం ముందు ఆగింది. రెండు బ్యాగులతో దిగాడు రవి. ఒక బ్యాగ్‌లో బట్టలు, మరో బ్యాగ్‌లో పుస్తకాలు. తర్వాత సత్యమూర్తి, చివరగా శ్యామల, చిన్నూ దిగారు.

ఆశ్రమం రిసెప్షన్‌లో ఒక వృద్ధుడు కూర్చొని వున్నాడు. ఆయన వెనక గోడ మీద "ఆత్మీయతకు అమ్మ ప్రతిబింబం... వాత్సల్యానికి నాన్న ప్రతిరూపం" అని రాసివుంది. అది చదివిన రవికి గుండెల్లో కలుక్కుమంది. అయినా తమాయించుకొని...

'సార్.. నిన్న ఫోన్ చేసి అపాయింట్మెంట్ తీసుకున్నాం..' అన్నాడు రవి.

'రండి కూర్చోండి... పేరు, వయస్సు చెప్పండి...'

కె.సత్యమూర్తి... వయస్సు 66ఏళ్లు..'

వివరాలు రాసుకుని, సంతకం పెట్టమని రిజిస్టర్‌ను ముందుకు తోశాడు రిసెప్షన్‌లో ఉన్న పెద్దాయన.

'మిమ్మల్ని ఎక్కడో చూసినట్టు అనిపిస్తోంది. కానీ ఎక్కడా... ఎప్పుడు అనేది గుర్తు రావడంలేదు...'

'అవునండీ... 30ఏళ్ల క్రితం ఇక్కడే చూశారు' అన్నాడు సత్యమూర్తి.

'అవునా...' అంటూ.. అప్పటి రిజిస్టర్ తీసి అందులో వెరిఫై చేశాడు.

'అవును సత్యమూర్తిగారు... మీకు పిల్లలు లేరని, ఇక్కడి అనాథ శరణాలయం నుంచి రెండేళ్ల బాబుని దత్తత తీసుకున్నారు కదా! ఇప్పుడు ఆ బాబు ఉన్నాడా..?'

'ఉన్నాడు... అప్పుడు మీరిచ్చిన పసికందు... వీడే. 'పేరు రవీంద్ర' అంటూ రవీంద్రను చూపి... మౌనంగా లోపలికి వెళ్ళిపోయాడు సత్యమూర్తి.

ఇదంతా వింటున్న రవీంద్ర, శ్యామల నిశ్చేష్టులయ్యారు. ✦

రైతుల వెతల బతుకు చిత్రాలు

మన భారతదేశం ప్రధానంగా వ్యావసాయిక దేశం. దేశంలో ఎక్కువ మంది రైతులే. రైతులేనిదే పంటలు లేవు. పంటలు పండనిదే ప్రజలకు తిండి లేదు. ఇటీవల పంటలు సరిగ్గా పండక అప్పుల ఊబిలో చిక్కుకొని అన్న దాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ కర్షకుల కడగండ్లను వెన్ను విరిగిన కంకులు కవితా సంపుటిలో డా. మక్కెన శ్రీనుగారు మనకళ్లకు కట్టించారు. ఈ కవితా సంపుటిని అభివాదం, శ్రమవేదం, ఆర్తనాదం, సమ్మోదం అనే నాలుగు అధ్యాయాలుగా విభజించి రైతుల జీవితాన్ని చిత్రీకరించారు. 'మట్టిలోని మెత్తదనాన్ని ఎరిగిన వాడు మొలకలో మృదుత్వం తడిమిన వాడు, మొక్కలకు లాలిత్యం నేర్పించిన వాడు' అని రైతుకు నిర్వచనం చెప్తూ 'అహం చేరని సనాతన సస్యాలయం రైతే ఒక విశ్వవిద్యాలయం' అని, రైతును కదిలే విశ్వవిద్యాలయంతో పోల్చి చెప్పారు. ఇప్పుడు ఎక్కడా సకాలంలో వానలు కురవడం లేదు. పంటలు పండడం లేదు. దీనినే వెతికిన కానని ఋతుపవనాలు వెంటాడిన అతుకుల బతుకులు, కరువైన గుప్పెడు తిండి మెతుకులు, బ్రతుకంతా రైతుకు వెతల గతుకులు అని రైతుల కష్టాల కడగళ్ల జీవితాని పాఠకుల ముందు

పుస్తకం: వెన్నువిరిగిన కంకులు
రచయిత: డా. మక్కెన శ్రీను
వెల:60/-
పేజీలు: 50
ప్రతులకు: డా. మక్కెన శ్రీను టిఎఫ్3, బొడ్డపాటి మాన్షన్ ఇఎస్ఐ బస్టాప్ దగ్గర, గుణదల, విజయవాడ. (అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు)

నిలబెడుతున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో వందలాది ఎకరాలున్న రైతులు కూడా కూలీలుగా మారిపోతున్నారు. ఒక పక్కన కల్తీ విత్తనాలు, మరో పక్క పెరిగిన ఎరువుల ధరలు, పంటలకు పెట్టిన పెట్టుబడి ధరలు రాక పొలాల యజమానులే కూలీలుగా మారిపోతున్నా విషాద దృశ్యాలు మరో పక్క సెజ్‌ల పేరిట ప్రభుత్వం వారు భూముల్ని స్వాధీనం చేసుకొంటున్నారు. దాన్నే కవి ప్రపంచీకరణ నేపథ్యంలో రైతుకూలీ, సెజ్‌ల రూపంలో కమతం సర్వం ఖాళీ, కార్పొరేటు ధరల మాయలో బక్కజీవి, ఆధునిక వ్యవసాయం చేరలేని నిర్జీవి' అని ఆధునిక రైతు అవస్థను వర్ణిస్తున్నారు.

ప్రపంచంలో ఏ వ్యాపారస్తుడైనా తాను ఉత్పత్తి చేసిన వస్తువుకు తానే ధర నిర్ణయిస్తాడు కానీ కష్టపడి రైతులు పండించిన పంటకు వేరే ఎవరో ధర నిర్ణయిస్తారు. ఇలాంటి వ్యవస్థలో రైతులు బలి పశువులుగా మిగిలిపోతున్నారు. దీన్నే గిట్టుబాటు ధర లేని పైరు ఉత్పత్తులు , చుట్టూ చీకట్లు అల్లుకున్న భవిష్యత్తులు నిట్టని లువునా మోసపోతున్న రైతు అవస్థ, చిట్ట చివరగా రైతును మిగిలిస్తున్న వ్యవస్థ' అంటూ ఈనాటి పెట్టుబడి దారి వ్యవస్థలో బడుగుజీవి రైతు అవస్థను అక్షర చిత్రాల్లో ఆవిష్కరిస్తున్నారు.

సరళమైన శైలిలో ఈ కవితాసంపుటి ఆద్యంతం చదువరులను చదివిస్తుంది. అస్పష్టత అనేదే లేనిదీ పుస్తకం. అర్థంకాని భావ చిత్రాలు రూపకాలు ఏమీ లేవు. పుస్తకమంతా అంత్యప్రాసలే. ఆధునిక వచన కవిత ఆ దశను ఎప్పుడో దాటిపోయింది. ఈ పుస్తకంలో వస్తువు సమకాలీనమైనదే. శైలి కూడా మారితే బాగుంటుంది. భవిష్యత్తులో ఈ సంప్రదాయ శైలిని వదిలి ఆధునిక శైలితో మరిన్ని కవితా సంపుటులు రాయగలరని ఆశిస్తున్నాను.

- మందరపు హైమవతి

రెండో యాత్ర

ఓ యాసిడ్ దాడితో ఓ బతుకు యాత్ర ఆగిపోతుండటం చూస్తుంటాం. స్వేచ్ఛగా సమాజంలో బతకాలన్న సర్వైవర్ పోరాటాన్ని ఏహ్యమైన చూపులు బలవంతంగా నాలుగు గోడల మధ్యకు నొక్కేస్తాయి. శరీరాన్ని ఛిద్రం చేసే యాసిడ్ కన్నా ముఖం పక్కకు తిప్పుకునే సమాజం చేసే గాయం మరింత లోతున మనసును మరింత కాల్చేస్తుంది. మరి సర్వైవర్ ఎలా అస్థిత్వాన్ని నిలుపుకోగలదు. వారికి జీవితపు రెండో యాత్ర ఎలా మొదలవ్వగలదు. ఇదే ఆలోచించాడు ఆకాశ్ భరద్వాజ్. ఢిల్లీకి చెందిన ఈ సామాన్యుడు ఓ చిన్న ఉద్యోగంతో యాసిడ్ దాడి బాధితులకు, అంధులకు సెకండ్ ఇన్నింగ్స్ అవకాశాన్ని కల్పిస్తున్నాడు.

ప్రత్యేకం

సరిగ్గా ఏడాది క్రితం ఆకాశ్ భరద్వాజ్ దీపావళి పండుగ జరుపుకోవడానికి ఢిల్లీలోని లజపతినగర్‌లో ఉన్నాడు. వారి వీధికి ఒక మహిళ బెలూన్స్ అమ్ముకుంటూ వచ్చింది. తాను బెలూన్స్ కొనడానికి వెళ్లి ఆమె ముఖాన్ని చూసేటప్పటికి ఆమె ముఖమంతా కాలిన గాయాలున్నాయి. ఏమైందని అడిగాడు ఆకాశ్. దానికి ఆమె చెప్పిన సమాధానం విని దిగ్భ్రాంతికి గురయ్యాడు. ప్రేమించలేదని పక్కింటి అబ్బాయి తనపై యాసిడ్ దాడి చేశాడనే విషయం విని చలించిపోయాడు. అందం పాడైందని భర్త వదిలేశాడని చెప్పడంతో నిశ్చేష్టుడయ్యాడు. ఆమెకి ఇద్దరు పిల్లలు. ఒంటరిగా పని చేసుకుంటూనే ఆమె తన పిల్లలిద్దరిని సాకుతుంది. దాడి ఘటనకు ముందు ఆమె ఒక షాపింగ్ మాల్‌లో సెక్యూరిటీ ఇన్‌చార్జిగా పనిచేసేవారు. యాసిడ్ దాడి తర్వాత ఆమెకు ఎవ్వరూ ఉద్యోగం ఇవ్వలేదు. ప్రతి ఒక్కరూ ఆమె ముఖం చూసి ఛీదరించారు. తనకున్న ప్రతిభ కన్నా తన అందానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్న విషయం ఆమెను మరింత కుంగదీసింది. ఆమె కథ తెలుసుకుని ఆకాశ్ బాధపడ్డాడు. ఆమెకు తనేం చేయగలడనే ఆలోచనలో పడ్డాడు. ఆమె చిరునామా తీసుకున్నాడు. కొన్ని రోజుల ఆలోచన తర్వాత ఆమే కాదు ఆమెలాంటి వారు చాలామంది యాసిడ్ దాడి బాధితులున్నారని వారివీ అవే కష్టాలని తెలుసుకున్నాడు. ఇలాంటి వారందరికీ రెండో జీవితం ఇవ్వాలంటే వారి కాళ్ల మీద వారిని నిలబడేట్టు చేయాలి. ఓ ఉద్యోగం కల్పించాలి. అది కుంగుబాటులోంచి వారిని బయటపడేస్తుంది. నాలుగు గోడల మధ్య నుంచి వారి అస్థిత్వాన్ని తిరిగి సమాజంలో పడేస్తుంది. అంతకు ముందు ఎప్పటి నుంచో ఆకాశ్‌కు ట్రావెల్ ఏజెంట్‌గా మంచి అనుభవముంది. దాన్నే ఎందుకు వీరి జీవితాల్లో మార్పు ఉపయోగించకూడదనుకున్నాడు. వెంటనే 'ఖాస్' అనే ట్రావెల్ కంపెనీని మొదలుపెట్టాడు. దానిలో కేవలం యాసిడ్ దాడి బాధితులకే ఉద్యోగాలిచ్చాడు. ఖాస్ అంటే హిందీలో సంతోషమని అర్థం. మారిన ముఖాన్ని నలుగురికి చూపించుకోలేని అవస్థలో ఉన్నవారు ఇప్పుడు వందల మంది యాత్రలకు ప్లాన్‌లు ఇస్తున్నారు. భద్రంగా పర్యటించేందుకు పనిచేస్తున్నారు. యాసిడ్ దాడి బాధితులే కాక అంధుల్ని కూడా ఉద్యోగంలోకి తీసుకున్నాడు ఆకాశ్. వారు ఎంతో సమన్వయంతో, కచ్చితత్వంతో విధుల్ని నిర్వహించడాన్ని చూసి వినియోగదారులు ఆశ్చర్యపోతున్నారు. కొంత మంది స్ఫూర్తి పొందుతున్నారు కూడా. చాలా మందికి తమకు సేవల్ని అందించేది అంధులంటే నమ్మలేకపోతున్నారు. ముఖ్యంగా 'ఖాస్' టార్గెట్ వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కుటుంబాలు. దేశ, విదేశ యాత్రలను నిర్వహిస్తోంది.

జాలి కాదు ప్రతిభ

ఇక్కడ పనిచేసే వీరంతా ప్రతి రోజూ ఉదయాన్నే నాలుగవ అంతస్తులోనున్న ఖాస్ ఆఫీసుకు వస్తారు. సాధారణ వ్యక్తుల సహాయం లేకుండానే వారు పనులను వారే చేసుకుంటారు. ఉదయం పూట సమయాన్నంత స్కూలు ప్రిన్సిపాల్స్‌ని, కాలేజీలో కార్యక్రమ నిర్వాహకులు, కార్పొరేట్ సంస్థల హెచ్‌ఆర్ టీమ్‌ల వివరాలు నెట్‌లో రాబడతారు. వారిని కలిసి మాట్లాడటానికి అపాయింట్‌మెంట్‌ని కోరుతూ ఈ-మెయిల్ పంపుతారు. వారే స్వయంగా క్లైంట్ల కార్యాలయాలకు వెళ్లి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు కూడా ఇస్తారు. ఒకసారి కుతుబ్ మినార్ స్కూలు ట్రిప్‌కి ఒక ఉద్యోగిని వెళ్లారు. వాళ్లు మొత్తం 280 మంది పిల్లలతో కలిసి ప్లాన్ చేసిన విహార యాత్రది. అది ముగిసే సరికి ఆమె అందరికీ మరింత దగ్గరైపోయింది. ఆమె పనితీరుకు ఆ స్కూలు ప్రిన్సిపాల్ మెచ్చుకున్నారు. పిల్లలకు ఆమె గురించి గొప్పగా చెప్పారు. తర్వాతి టూర్లకు ఆమెనే పంపించాలంటూ ప్రిన్సిపాల్ ఫోన్ చేసి ఆకాశ్‌కు చెప్పారు కూడా. జాబ్ ఎక్సస్ స్పీచ్ సాయంతో కంప్యూటర్లను ఉపయోగిస్తారు. జాబ్ ఎక్సస్ స్పీచ్ సాయంతో వారు కంప్యూటర్ల స్క్రీన్ మీద ఉన్నదాన్ని చదువుతారు. వారు స్మార్ట్ ఫోన్లను ఉపయోగిస్తారు. సంస్థ ప్రారంభించిన కేవలం 20 రోజుల్లో 75 మందితో మాట్లాడితే 19 మందితో అపాయింట్‌మెంట్‌లు ఫిక్స్ అయ్యాయి. ఐదుగురు టూర్‌కి ఫైనలైజ్ చేసేశారు. వారు వారి మీద జాలి, దయ, కరుణ చూపడాన్ని ఇష్టపడరు. వారు డీల్‌ని హేండల్ చేసేటపుడు చాలా చాకచాక్యంగా వ్యవహరిస్తారు. వారికున్న ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తారు. కష్టించి పనిచేయాలనే మనస్తత్వం వారిని మరింత ముందుకు నడిపిస్తోంది. ఆకాష్ వారికి సుమారు రెండు నెలలపాటు శిక్షణనిచ్చారు. వారికి అవసరమైన పరిజ్ఞానాన్ని బోధించారు. వారిని మెరికల్లా తీర్చిదిద్దారు. వచ్చే ఏడాది మరో బ్యాచ్ ప్రారంభం కాబోతోంది. ఇక్కడ వారంతా చాలా సంతోషంగా పనిచేస్తారు. ఆఫీసుకు రావడానికి ఎంతో ఇష్టపడుతుంటారు. వారంతా కలిసి మెలిసి పనిచేసుకుంటుంటారు. కొత్త వారితో పరిచయాలు పెంచుకోవడం, వారితో అనేక అంశాలపై మాట్లాడతారు. కుటుంబాలను వదిలిపెట్టి ఇక్కడ కొంతమంది మహిళలు పనిచేస్తూ ఉంటారు. అలాంటి వారిక్కడ హాస్టల్‌లో ఉంటారు. ఒక ఉద్యోగిని భర్త చనిపోతే ఏడేళ్ల కూతురితో హాస్టల్లోనే ఉంటోంది.

- క.వి.చుసరా

పుస్తకాల బాటలు

అక్షర రూపం దాల్చిన సిరా చుక్క వేయి మెదళ్లకు కదలిక అంటాడు కాళోజి. ఒక మనిషి ఉన్నతస్థానం సంపాదించాలన్నా, తన జీవిత గమ్యాన్ని నిర్ణయించుకునే దిశానిర్దేశం పొందాలన్నా పుస్తకాలతో సాహచర్యం తప్పనిసరి. అందుకే 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో- మంచి పుస్తకం కొనుక్కో' అంటాడు కందుకూరి. శరీరానికి వ్యాయామం ఎలాంటిదో మనసుకు పుస్తక పఠనం అలాంటిదని కూడా చెబుతారు. పుస్తకాన్ని మించిన నేస్తం లేదంటారు హెమింగ్వే! ఈ అక్షర తీరానికి చేర్చే పుస్తక బాటలెన్నో దేశంలో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి ఇవే.



ఈ పుస్తక మార్కెట్‌లలో కొత్త, పాతా అని లేదు. దాదాపు ఏ పుస్తకం కావాలన్నా దొరుకుతుంది. ఈ మార్కెట్‌లు పుస్తక నిధులు. దేశరాజధాని నగరం న్యూఢిల్లీలో రెండు ప్రముఖ పుస్తక మార్కెట్లు పాఠకులను అలరిస్తున్నాయి.

దరయా గంజ్‌లో తప్పిపోతారు

దర్యాగంజ్‌లో ఆదివారం ఏర్పాటు చేసే పుస్తక మార్కెటు చాలా పేరు పొందింది. పుస్తక ప్రేమికులందరికి 'వన్-స్టాప్' మార్కెట్‌లా ఇది సేవలు అందిస్తోంది. ఈ మార్కెట్‌లోకి అడుగు పెడితే పుస్తకాల టైటిళ్లల్లో పాఠకులు తప్పిపోతారు. అంత సాహిత్యం ఇక్కడ దొరుకుతుంది. ఏది కొనాలో ఏది కూడదో అనే సందేహంతో పాటు ఒకటి కొందామని వచ్చిన వాళ్లు మూడు నాలుగు పుస్తకాల్ని కొనేంతగా పాఠకులు నిగ్రహం కోల్పోతారు. అటువంటి పుస్తక సంపద ఇక్కడ లభిస్తుంది. ప్రఖ్యాత రచయిత, పాత్రికేయుడు కుష్వంత్ సింగ్ లాంటి మహా రచయితలు పుస్తకాల కోసం ఇక్కడ తిరుగుతూ కనిపిస్తారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంటుందని ఒకప్పుడు ఈ మార్కెటును మూసివేయాలనుకున్నారు. కానీ పలువురు ప్రముఖుల విజ్ఞప్తి మేరకు దానిని అలాగే కొనసాగిస్తున్నారు.

చదువులకు నయీ సడక్

పాఠశాల, కళాశాల చదువులకు కావాల్సిన అన్ని పుస్తకాలు ఢిల్లీలోని నయీ సడక్ పుస్తక మార్కెట్‌లో దొరుకుతాయి. ఆదివారం మినహాయించి అన్ని రోజులలోనూ పుస్తక మార్కెట్ తెరిచే ఉంటుంది. ఇక్కడ పుస్తకాలు హోల్‌సేల్‌గానూ రిటైల్‌గానూ లభిస్తాయి. ప్రధానంగా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇక్కడ దొరుకుతాయి. పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఇక్కడ పుస్తకాలు కొనడానికి ఎంతో ఉత్సాహపడతారు. పుస్తకాలతో పాటు విద్యా సంబంధ సామగ్రి (స్టేషనరీ) కూడా ఈ మార్కెటులో లభించడం విశేషం.



సెకండ్ హ్యాండ్ అవెన్యూ

బెంగళూరులోని అవెన్యూ రోడ్ అత్యంత రద్దీగా ఉండే మార్కెట్ ఇది. ఇది నగర నడిబొడ్డున ఉంటుంది. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లకు అత్యంత సమీపంలో ఉంటుంది. ఇక్కడ సహజంగా సెకండ్ హ్యాండ్ పుస్తకాల వ్యాపారం జోరుగా సాగుతుంది. వస్త్రాలు, బంగారు నగల వ్యాపారానికి కూడా ఇది ప్రసిద్ధి. చాలా పాత పుస్తకాల్ని కూడా ఇక్కడ చూడొచ్చు. విలువైన విదేశీ పుస్తకాలను కూడా తక్కువ ధరకే కొనుక్కునే అవకాశం దొరకొచ్చు. మలుపు మలుపులో కాలిబాటల పక్కనే పరుచుకునే పుస్తక దొంతరల్లో మనక్కావాల్సిన టైటిల్‌ను వెతుక్కోవడం కష్టమే. కానీ అదే విషయాన్ని అమ్మే వ్యక్తికి చెబితే టక్కున తీసిఇస్తాడు. అంత పరిజ్ఞానం వాళ్లకు ఉంటుంది. వీరిలో చదువరులు కూడా తగులుతుంటారు. ఏదో పుస్తకం చదవుతూనే మనక్కావాల్సిన సెక్షన్ వైపు వేలు పెట్టి చూపిస్తుంటారు.

ప్రపంచంలోనే అతి పెద్దది

దేశంలోని అత్యంత పెద్దదైన పుస్తక మార్కెట్‌గానూ, ప్రపంచంలోనే అతిపెద్ద సెకండ్ హ్యాండ్‌బుక్ మార్కెట్ గానూ కోల్‌కతాలోని కాలేజీ స్ట్రీట్‌కు పేరుంది. ఒకవిధంగా చెప్పాలంటే 'పుస్తకాల కాలనీ' (కాలనీ ఆఫ్ బుక్స్)గా దీనిని పిలుస్తారు. ఇక్కడ పుస్తకాలు అందుబాటు ధరలో లభిస్తాయి. అవసరమైతే మనం బేరం కూడా చేయవచ్చు.

పొత్తాల కోట

ముంబయికి గుండెకాయ లాంటిది ఫోర్ట్ సిటీ. ఇది ఉత్తరాన విక్టోరియా టెర్మినస్ నుండి దక్షిణాన కళాఘోడా వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలోని ఫ్లోరా ఫౌంటెన్‌కు దగ్గరలో సెకండ్ హ్యాండ్ బుక్ షాపులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. చాలా తక్కువ ధరలకే అత్యంత విలువైన పాత పుస్తకాలు ఇక్కడ దొరుకుతాయి. అరుదైన, అత్యంత ఖరీదైన 'కాఫీ టేబుల్' పుస్తకాలు కావాలంటే ఇక్కడ పచార్లు కొడితే సరి.

ఇవే కాదు చండీగఢ్ సెక్టార్-15 అత్యంత అరుదైన రచయితల పుస్తకాలకు ప్రసిద్ధి. ప్రత్యేకించి అకడమిక్ బుక్స్ ఇక్కడ ఉంటాయి. కళాశాల విద్యార్థులకు ఇది ఒక హబ్ లాంటిది. హైద్రాబాద్ అబిడ్స్, సండేబుక్ మార్కెట్‌లోను దాదాపు అన్నిరకాల పుస్తకాలు లభిస్తాయి. కాల్పనిక సాహిత్య పుస్తకాలతో పాటు, సాంప్రదాయ గ్రంథాలు, జర్నల్స్, కామిక్స్ వంటివి దొరుకుతాయి. సగం ధరకే పుస్తకాలు అమ్మడం ఇక్కడ విశేషం. ఢిల్లీ, బేర్‌సరాయ్ మార్కెట్ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఐఐటికి మధ్య ఉన్న ఒక చిన్న ప్రదేశం. ఇక్కడ పాత, కొత్త పుస్తకాలతో పాటు సెకండ్ హ్యాండ్ బుక్స్ కూడా ఉంటాయి. విజయవాడ లెనిన్ సెంటర్ ప్రజాదరణ పొందిన పుస్తక విపణి. ఇక్కడ పాత, కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులకు, పుస్తక ప్రియులకే కాకుండా పలువురు ప్రముఖ సాహితీ వేత్తలకు, రచయితలకు ఇది ఇష్టమైన పుస్తకాల మార్కెట్. అలనాటి ప్రాచీన గ్రంథాల నుంచి ఇప్పటి ఆధునాతన పుస్తకాల వరకు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఎప్పుడైనా ఆ నగరాలకు వెళితే ఈ వీధుల్లో, ఆ బాటల్లో ఓసారి నడవండి. ఓ నాలుగు పుస్తకాలన్నా కచ్చితంగా ఊరిస్తాయి.

✦ - కె.ఎస్.ఎమ్

మష్రూమ్ ఆమ్లెట్

కావాల్సిన పదార్థాలు

పుట్టగొడుగులు- 100 గ్రాములు
గుడ్లు-3
మిరియాల పొడి - 1 టీస్పూన్
ఛాట్ మసాలా- 1/2 టీ స్పూన్
వెన్న -1 టేబుల్ స్పూన్
పచ్చిమిర్చి-2
ఉల్లిపాయలు-2
కొత్తిమీర తరుగు- 1కప్పు
ఉప్పు-చిటికెడు
నూనె- తగినంత

తయారుచేసే విధానం

ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో గుడ్డు సొన, ఉప్పు, సన్నగా తరిగి పెట్టుకున్న పుట్టగొడుగు ముక్కలు, కొత్తిమీర తరుగు వేసి బాగా బీట్ చేసుకోవాలి. స్టౌపై పాన్ ఉంచి కొద్దిగా నూనె వేసి వేడెక్కిన తర్వాత గుడ్డు మిశ్రమాన్ని పాన్ పై పోయాలి. ఆమ్లెట్ రెండు వైపులా కాగేలా ఉంచి రెండు నిమిషాల తర్వాత దానిపై మిరియాల పొడి, చాట్ మసాలా చిలకరించాలి. చీజ్, బటర్‌ని కూడా వేసి కొద్దిగా చల్లారిన తర్వాత రుచిచూడండి.

ధనియా వడ

కావాల్సిన పదార్థాలు

శనగపిండి-2 కప్పులు
కొత్తిమీర తరుగు- 1కట్ట
ఉల్లిపాయల తరుగు- 1/2 కప్పు
పచ్చిమిర్చి-3(సన్నగా కట్ చేసుకోవాలి)
అమ్‌చూర్ పొడి-1 టేబుల్ స్పూన్
కారం-1 టేబుల్ స్పూన్
ఉప్పు-సరిపడా
బియ్యప్పిండి- 2 టేబుల్ స్పూన్లు
నీరు- 1 కప్పు
నూనె- ఫ్రైకి సరిపడా

తయారుచేసే విధానం

ముందుగా ఒక బౌల్‌లో శెనగపిండి, కొత్తిమీర, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, ఉప్పు, అమ్ చూర్ పొడి, కారం, బియ్యప్పిండి వేసి బాగా కలుపుకోవాలి. అందులో సరిపడినన్ని నీరు పోసి మరోసారి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి చేత్తో వత్తి ఒక ప్లేట్‌లో పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత ముందుగా ప్రెస్ చేసి పెట్టుకున్న వడల్ని అందులో వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ఇలా మొత్తం ఉండలన్నిటినీ వేయించి సర్వింగ్ ప్లేట్‌లోకి మార్చి కెచెప్ లేదా సాస్‌తో వేడి వేడి ధనియా వడల్ని టేస్ట్ చేయండి.

ఆలూ కచోరీ



కావాల్సిన పదార్థాలు

గోధుమ పిండి- 3 కప్పులు
రవ్వ-1 కప్పు
ఉప్పు -రుచికి సరిపడా
బేకింగ్ సోడా-చిటికెడు
నూనె- తగినంత
బంగాళాదుంపలు- 4 (ఉడికించినవి)
అల్లం తరుగు-1టేబుల్ స్పూన్
కొత్తిమీర తరుగు-3 టేబుల్ స్పూన్‌లు
జీలకర్ర-1 టేబుల్ స్పూన్
ధనియాలపొడి-1 టేబుల్ స్పూన్
ఆమ్ చూర్ పొడి-1టేబుల్ స్పూన్
గరంమసాలా-1 టేబుల్ స్పూన్

తయారుచేసే విధానం

ముందుగా గోధుమపిండి, రవ్వ, ఉప్పు, నూనె, బేకింగ్ సోడాలని ఒక బౌల్‌లో వేసి కలుపుకోవాలి. తర్వాత అందులో గోరువెచ్చని నీరు పోసి పిండిని మెత్తగా కలిపి అరగంట సేపు పక్కన పెట్టుకోవాలి. స్టౌపై పాన్ పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత అందులో జీలకర్ర, ఉడికించిన బంగాళ దుంపలు, అల్లం, పచ్చిమిర్చి, కొత్తిమీర తరుగు, అమ్‌చూర్ పొడి, గరంమసాలా వేసి మొత్తం మిశ్రమాన్ని కలుపుకొని రెండు నిమిషాలు వుంచి దించేయాలి. ఇప్పుడు ముందుగా కలిపి పెట్టుకున్న పిండిని చిన్న ఉండలుగా చేసుకోవాలి. వాటిని చేత్తో పూరీల్లా వత్తి దానిపై బంగాళదుంపల మిశ్రమాన్ని వుంచి దానిపై మరో పూరీని పెట్టి స్టఫింగ్ బైటికి రాకుండా అన్ని వైపులా చేత్తో ప్రెస్ చేయాలి. వీటిని చెపాతీ కర్రతో మరోసారి వత్తి పక్కన పెట్టుకోవాలి. స్టౌపై బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత కచోరీలని వేసి గోధుమ రంగు వచ్చిన తర్వాత సర్వింగ్ ప్లేట్‌లోకి మార్చుకోవాలి. వేడి వేడి కచోరీలను మీకు నచ్చిన కర్రీ లేదా చట్నీతో టేస్ట్ చేయండి.

ఏమిటది?

పిడికెడంత పిట్ట పెద్దగా ఊదర కొడుతుంది....
పట్టుకుండే చెవిలో గుసగుసలాడుతుంది ...

పదాలు గుర్తించండి



a	c	s	u	b	w	a	y	c
w	b	i	k	e	u	n	t	b
t	e	b	u	c	p	e	r	u
r	r	s	e	w	l	k	b	s
u	w	j	g	c	a	r	o	u
c	t	r	a	i	n	s	a	p
k	s	e	u	y	e	x	t	h

మనం ప్రయాణించే వాహనాల బొమ్మలు, వాటిపేర్లను ఇక్కడుంచాం. పైనున్న అక్షరాల పట్టికలో ఆ పేర్లు ఎక్కడున్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.

ఏ నీడ ఎవరిది



ఇక్కడ మీకిష్టమైన కొన్ని బొమ్మలతో పాటు వాటి నీడలని ఉంచాం. ఏ నీడ ఎవరిదో గుర్తించి వాటిని జతచేయండి.





తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నాచుట్టేయండి.

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనో టాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

కనిపెట్టండి

అగ్గిపుల్లలతో చేసిన ఈ బొమ్మలో కొన్ని అగ్గిపుల్లల్ని కదిలిస్తే ఒక దీర్ఘచతురస్రం ఏర్పడుతుంది. అదెలాగో కనిపెట్టండి.





జవాబు

బొమ్మ పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ సింహం బొమ్మని ముందుగా సంగం గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండే!

తొమ్మిదేళ్ల చెస్ మాస్టర్

పిల్లలూ! మీరు అమ్మానాన్నలతో, ఫ్రెండ్స్‌తో చదరంగం ఆడే ఉంటారు. కొందరైతే స్కూల్‌లో నిర్వహించే చెస్ పోటీల్లో పాల్గొని ప్రైజ్‌లు గెలుచుకుని వుంటారు. అచ్చు మీలాగే చెస్ ఆటని ఇష్టంగా ఆడేస్తుంటాడు ముంబయికి చెందిన సచ్‌దేవ్. చిన్నప్పటి నుండే తన అక్క ఆడే చెస్ టోర్నమెంట్‌లన్నిటికీ తల్లితండ్రులతో కలిసి వెళ్లేవాడు దేవ్ షా. తన మూడో ఏట ఒక రోజు అమ్మానాన్నలకి చెస్ ఆడుతూ కనిపించాడు. ఏదో మామూలుగా ఆడుకుంటున్నాడని అనుకున్నారు తల్లిదండ్రులు. అయితే తెలివిగా పావులని కదిపే విధానాన్ని



దేవ్ షా

చూసి ఆశ్చర్యపోయారు. నాలుగేళ్ల వయసులో చెస్‌లో శిక్షణ ప్రారంభించిన దేవ్ బడి చదువుతో పాటు రోజుకి నాలుగైదు గంటలు చదరంగం శిక్షణకి కేటాయిస్తాడు. ప్రతి పోటీలోనూ ప్రత్యర్థుల్ని ఎత్తుకు పైఎత్తుతో ఓడించే ఈ చిచ్చర పిడుగు మామూలు ఆటగాడు కాదు. తొమ్మిదేళ్ల వయసుకే ఎన్నో చెస్ పోటీల్లో పతకాలు సాధించాడు. ఏడేళ్ల వయసులోపు పిల్లలకి నిర్వహించే (అండర్-7) ఏషియన్ స్కూల్స్ చెస్ పోటీల్లో రెండు బంగారు పతకాలు, కామన్ వెల్త్ చెస్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం, మహారాష్ట్ర స్టేట్ చెస్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం, నేషనల్ ఏజ్ గ్రూప్ చెస్ చాంపియన్ షిప్‌లో వెండి పతకం, వరల్డ్ యూత్ చెస్ చాంపియన్‌షిప్‌లో వెండి పతకంతో పాటు, గతేడాది బ్రెజిల్‌లో జరిగిన పోటీల్లోను తన విభాగంలో బంగారు పతకాన్ని సాధించాడు సచ్‌దేవ్. ఈ ఏడాది టెడెక్స్-ఎన్ఐఎమ్‌లో ప్రసంగించే అరుదైన అవకాశాన్ని అందుకున్న దేవ్ షా పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే తమదైన గుర్తింపు కలిగుండాలంటూ ఒక ప్రసంగం కూడా చేశాడు. 'చెస్‌లో రాజు, రాణి ఇతర పావులు ఎక్కువ బలమైనవనుకుంటారు. అందుకే భటుడిని తేలిగ్గా తీసేస్తాం. అయితే యుద్ధంలో భటులే వీరందరినీ కాపాడుతుంటారు. మన సమాజంలోనూ ఇలాంటి పరిస్థితులే కనిపిస్తాయి. పెద్ద స్థాయిలోవున్న వ్యక్తుల్ని ఎక్కువగా పొగిడేస్తూ చిన్న స్థాయిలో వారిని తక్కువచేసి చూస్తుంటారు. కానీ అలాంటి వారే పెద్ద విజయాలని సాధిస్తారు.' అని తను చెప్పిన ప్రసంగం విని అక్కడున్న వారందరూ ఆశ్చర్యపోయారు. చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌తోపాటు ఇష్టమైన క్రికెట్ ప్లేయర్ సచిన్‌ని కలిసి ప్రశంసలందుకున్నాడు.

పద వికాసం - 33

కూర్పు: రావెళ్ల

■	1	2		■	3	4		■
5	■		■	6	■		■	■
7		■	8			■	9	10
	■	11	■		■	12	■	
13				■	14			
	■		■	15	■		■	
16		■	17			■	18	
■	■	19	■		■	20	■	
■	21			■	22			■

ఆధారాలు

అడ్డం

1. విషం (3)
3. ఒక మాసపత్రిక (3)
7. తిరగబడ్డ లెగ్ (2)
8. కంపం (3)
9. పువ్వుకూ, పండుకూ మధ్యది (2)
13. ఉప్పు (4)
14. ప్రతి ఒక్కరికీ దేశంపై ఉండే భక్తి కుడి నుండి (4)
16. ఎద్దుకాదు నల్లనిది (2)
17. కిసలయము (3)
18. రోషం ఉన్నవాడు మెలేసేది (2)
21. శరీరము (3)
22 . ప్రేమ (3)

నిలువు

2. అనురాగం (2)
4. శార్దూలం (2)
5. ఎలుకల్ని చంపడానికి పెట్టేమందు (6)
6. ఒక నొప్పి (3)
10. ఒక సంస్కృత సంధి (6)
11. గణాలలో ఒకటి (3)
12. కొండ (3)
15. ఎరుపు రంగు (3)
19. ఒక సంవత్సరం పేరు (2)
20. విష్ణువు (2)

సుడోకు

	7		2	3	8			
			7	4		8		9
	6	8	1		9			2
	3	5	4					8
6		7	8		2	5		1
8					5	7	6	
2			6		3	1	9	
7		9		2	1			
			9	7	4		8	

గతవారం జవాబులు

1	5	4	7	6	8	2	9	3
2	8	9	1	3	4	5	7	6
3	6	7	9	2	5	8	4	1
4	7	8	2	9	3	6	1	5
5	3	6	4	7	1	9	8	2
9	1	2	5	8	6	4	3	7
6	9	1	8	5	7	3	2	4
7	2	3	6	4	9	1	5	8
8	4	5	3	1	2	7	6	9

1 బ	డి	2 బా	3 ట	■	4 లా	5 లా	పే	6 ట
ల	■	7 లు	క	లు	క	లు	■	ప
8 పా	9 దం	■	రి	■	రు	■	10 దా	ట
11 లు	డ	వ	■	12 త్రి	■	13 గ	రి	ప
■	కా	■	14 గ	యా	నా	■	వే	■
15 పా	ర	ణం	■	న్	■	16 వి	ర	17 హం
18 పా	ణ్యం	■	19 న్నె	■	20 అ	■	21 యా	స
పా	■	22 స	చి	వా	ల	23 యం	■	పా
24 పా	ల	గి	న్నె	■	25 క	ల	గ	డు

కలప కళలు

సముద్ర తీరాలకు కొట్టుకొచ్చే ఓ మోడువారిన మాను అశ్వంలా అంతెత్తు పైకి లేస్తుంది. చెక్కిపారేసిన చెక్కపొట్టు పక్షిలా ఎగిరిపోతుంది. ఇంటి కలప కోతకు గురైన వ్యర్థపు ముక్కలు కోట కడతాయి. మర యంత్రాలైతాయ్.. మహాద్భుతాలైతాయ్.. కలపతో కాదేదీ అనర్హమంటూ జీవం పోసుకున్న శిల్పాలివి. విభిన్న ఆకృతులను మలిచిన కలప కళాకారులు సెర్గీ బాబ్‌కోవ్, రాబ్ హెర్డ్, ఫిల్ బిషప్, మైకేల్ రియా, హరోషి, జేమ్స్ మెక్‌నాబ్, విల్లీ వెర్గినెర్, ఎఫ్రైమ్ రోడ్రిగ్జ్ కోబోస్, వెర్నర్ ఆర్నాల్డ్, డగ్ రోవెల్, జెఫ్ ఉట్టో, జోషువా అబార్బానెల్, బాబ్ కింగ్, పాల్ బైకర్ ఏజేఫోసిక్‌లు ఆ కళను మరో ఎత్తుకు తీసుకుపోయారు. ఆధునికతను మేళవించి అద్భుత కళాఖండాలను రూపొందించారు.







You have Problems?
I have Solutions !
నేనున్నాను !

సమస్యలతో రండి!
సక్సెస్‌తో దూసుకుపోండి...



నత్తి, డిప్రెషన్, గుండెదడ, నరాల బలహీనత, భయం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ప్రేమ వైఫల్యం, మద్యం, సిగరెట్లు, ఖైనీ, ఆత్మవిశ్వాసం లోపించడం, మరియు అనేక సమస్యలకు ఎంతో మంది నా వద్దకు వచ్చి హిప్నో-సైకోథెరపీ ద్వారా పరిష్కరించుకున్నారు. సక్సెస్ అయ్యారు, ఇక మీ వంతు, మీకు సమస్యలున్నా సక్సెస్ కావాలన్నా భవిష్యత్‌లో స్థిరపడాలన్నా...

నేనున్నాను !

Contact for Corporate Programs
Cell: 98481 90302

VIP Vidhatha *Institute of Personality Developmnet*

33ఏళ్ళ అనుభవంతో **వ్యక్తిత్వ వికాసం**

రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు నెట్‌వర్క్ మార్కెటింగ్ ప్రతినిధులకు షాపింగ్‌మాల్స్, హాస్పటల్ సిబ్బందికి స్కూల్స్, ఇంజనీరింగ్, మేనేజమెంట్ కాలేజిలకు, ప్రత్యేక శిక్షణ కై సంప్రదించండి

6,000 పవర్ పాయింట్ ప్రదర్శనలు మా వద్ద రెడిగా కలవు

డా॥ క్రాంతికార్
(Psychologist , Hypno-Therapist & HRD trainer)
(PhD),MSc(Psychology),MSc(Counseling Psychology), MSc(App Psy), MA (Child Care),BSc(Psy),BA(Psy),BNat (Naturopathy & Yoga), DY(Yoga),YCC(Yoga),MBA(HR),MA(PPM), MA(S), MA(PPS), MLM,MA(GT), MA(Phy), BCom,HDSE & More
ప్రముఖ సైకాలజిస్ట్

websites : www.krantikar.blogspot.in
www.vidhatha.in, www.kranthikar.com
www,facebook.com/krantikar ye
Hyderabad : 93 93 11 2021, Vizag :9440 633 610

Check List

Book Number	KNSR02B140	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29